Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 134 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 2 - 12 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

## ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం సీరియస్.. కేంద్రంపై మండిపాటు




ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తారాస్థాయికి చేరిన సంగతి తెలిసిందే. ఢిల్లీ వాయు కాలుష్యంపై సుప్రీం కోర్టు సీరియస్ అయింది. ఢిల్లీ కాలుష్యానికి పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనమే కారణమన్న కేంద్రంపై మండిపడింది. రైతులను నిందించడమే కేంద్రానికి ఆనవాయితీగా మారిందంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. కోవిడ్ సమయంలో కూడా రైతులు తమ పంట వ్యర్థాలను తగలపెట్టారని, అప్పుడు లేని కాలుష్యం ఇప్పుడెలా వచ్చిందని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. వాయు కాలుష్యానికి ఇతర కారణాలేమిటో చెప్పాలని అంది. కాలుష్య కారకాలను పరిష్కరించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వారం రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కేంద్రానికి సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఢిల్లీలో వాయు కాలుష్యం కారణంగా జనం తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. చిన్న పిల్లలు, వృద్ధుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. చిన్న పిల్లలు ముక్కు, గొంతు సంబంధిత సమస్యలతో అల్లాడిపోతున్నారు. సర్జరీలు సైతం చేయించుకోవాల్సి వస్తోంది. ఢిల్లీలో వాయు కాలుష్యానికి చుట్టు పక్కల రాష్ట్రాల ప్రజలు పంట వ్యర్థాలను కాల్చటం ప్రధాన కారణంగా తెలుస్తోంది. గత సెప్టెంబర్ నెలలో సుప్రీంకోర్టు పంట వ్యర్థాలను కాల్చే రైతులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పంట వ్యర్థాలను కాల్చే వారిని జైల్లో వేయాలని అంది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ మాట్లాడుతూ.. 'రైతులు ప్రత్యేకమైనవారు. కాదనడం లేదు. వారి కారణంగానే అన్నం తింటున్నాం. అలాగని పర్యావరణాన్ని రక్షించకుండా ఉండలేం' అని అభిప్రాయపడ్డారు.

## పింఛన్ల పంపిణీలో ఏపీదే అగ్రస్థానం : సీఎం చంద్రబాబు



**ఏలూరు, (రాజధాని వార్తలు):** సూపర్ సిక్స్ పథకాలను సక్సెస్ చేసిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. పింఛన్లకు ఏపీ కంటే ఏ రాష్ట్రం కూడా ఎక్కువ ఖర్చుపెట్టడం లేదని తెలిపారు. సోమవారం ఏలూరు జిల్లాలోని గోపీనాథపట్నంలో చంద్రబాబు పర్యటించారు. మహిళ నాగలక్ష్మికి పెన్షన్ అందజేశారు. నల్లమాడులో స్టాళ్లను సీఎం, మంత్రులు పరిశీలించారు. అనంతరం ప్రసంగించారు. తాను, తన మిత్రుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఒకే విధంగా ఆలోచిస్తామని పేర్కొ న్నారు సీఎం చంద్రబాబు.

**అప్పులు ఉన్నాయి..**

తమ ప్రభుత్వంలో పింఛన్ల పంపిణీకి ఏడాదికి రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో వందమందిలో పదమూడు మందికి పెన్షన్లు ఇస్తున్నామని.. వారిలో 59శాతం మంది మహిళలే పనిచేయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు రూ.1650 కోట్లు బకాయిలు పెట్టిందని మండిపడ్డారు. ఆ బకాయిలను తీర్చడమే కాదని, ఇప్పుడు కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా నాలుగు గంటల్లో పైసలు ఇస్తున్నామని వివరించారు. 25 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు పథకాన్ని వినియోగించుకున్నారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు రూ.550 కోట్లు ఉచిత బస్సు పథకానికి ఖర్చు చేశామని వెల్లడించారు. చింత లపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు.

**పోలవరం పూర్తయితే ఏపీకి నీళ్లు వస్తాయి..**

'గోదావరి జిల్లాలు పారిశ్రామికంగానూ అభివృద్ధి చెందాలి. పోలవరం పూర్తయితే ఏపీకి నీళ్లు వస్తాయి. విశాఖపట్నంలో రూ. లక్షా 40 వేల కోట్లతో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. ఏపీని అభివృద్ధి చేయడానికి రీజియన్లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రపం చంలోనే అందమైన నగరంగా అమరావతి నిర్మాణం చేస్తాం. వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు జనవరిలోగా మరమ్మతులు చేస్తాం. ప్రజల ఆరోగ్య సంరక్షణకు సంజీవిని పథకం తీసుకువస్తాం. గత జగన్ ప్రభుత్వ పాలన రాష్ట్రాన్ని దెబ్బతీసింది. గత వైసీపీ ప్రభుత్వంలో గంజాయిపై ఒక్క రివ్యూ మీటింగ్ పెట్టలేదు. గంజాయి అందరికీ అలవాటై లేడీ డాన్‌లు పుట్టుకువచ్చారు. రాయలసీమలో ముఠాలు లేవు. నేరాలు ఉన్నాయి. రాష్ట్రంలో బాబాయ్‌ను గొడ్డలి పెట్టుతో లేపేసేవారు ఉన్నారు. దేవాలయాలు, ప్రార్థన మందిరాల వైపు వస్తే అదే చివరి రోజు కావాలి. తిరుపతిలో అదే అంశంపై మాట్లాడితే నాపై దాడికి కొంతమంది ప్రయత్నించారు. వేంకటేశ్వర స్వామి సాక్షిగా నేను బయటపడ్డాను. ఏదైనా పని మీద ఇష్టపడి, కష్టపడితే విసుగు ఉండదు. కొందరు నటిస్తారు.. అది నటనకే పరిమితం అవుతుంది' అని సీఎం చంద్రబాబు విమర్శించారు.

**ఏలూరు కలెక్టర్ పనితీరుపై సీఎం అసంతృప్తి**

ఏలూరు కలెక్టర్ పనితీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వయంగా తానే గ్రామసభ నిర్వహిస్తున్నానని చెప్పుకొచ్చారు. ప్రజాసమస్యలపై సిబ్బంది కనీస అవగాహన లేకుండా గ్రామసభకు ఎలా వచ్చారని కలెక్టర్ వెట్రి సెల్వినిని సీఎం ప్రశ్నించారు. ఒక గ్రామంలో ఎన్ని టాయిలెట్స్, ఎన్ని ఇళ్లు ఉన్నాయనే కనీస అవగాహన లేకుండా గ్రామసభకు ఎలా వచ్చారని ఫైర్ అయ్యారు. తమ ప్రభుత్వం మొక్కుబడిగా గ్రామసభలు నిర్వహించడం లేదని మండిపడ్డారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల ఆదాయం పెరిగే విధంగా అధికారులు ఆలోచించాలని సూచించారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

## విమాన సర్వీసులపై కేంద్ర మంత్రితో టీడీపీ ఎంపీల చర్చలు

**న్యూఢిల్లీ :** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో టీడీపీ ఎంపీలు సోమవారం భేటీ అయ్యారు. విజయవాడ – హైదరాబాద్ విమాన సర్వీసులు, ప్రయాణీకుల అవస్థలపై కేంద్రమంత్రిని తెలుగుదేశం ఎంపీలు కలిశారు. విజయవాడ – హైదరాబాద్ విమాన సర్వీసుల ధరలు రూ. 18 వేలపైనే ఉంటున్నాయని... అయినా సీట్లు దొరకడం కష్టమవుతోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఏటీఆర్ చిన్న విమానాల వల్లే ఈ సమస్య ఏర్పడుతోందన్నారు. అమరావతికి వచ్చే పెట్టుబడిదారులు కూడా ఏటీఆర్‌లను చూసి ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు. విదేశీ ప్రయాణీకుల లగేజ్ కూడా వారితో రావడం లేదని, రెండు మూడు రోజుల తర్వాత చేరుతుందన్న ఫిర్యాదులు కూడా రోజురో జుకు పెరుగుతున్నాయని ఎంపీలు తెలిపారు. అవకాశం ఉన్నం తలో త్వరగా ఏటీఆర్‌ల స్థానంలో పెద్ద విమానాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రామ్మోహన్ నాయుడిని కోరారు. ఈ విషయాలు తన దృష్టికి కూడా వచ్చాయని ఎంపీలకు కేంద్ర మంత్రి తెలిపారు. అదేవిధంగా విజయవాడ నుంచి అహ్మదాబాద్, వారణాసి, పూణే, కొచ్చి, గోవాలకు కూడా కనెక్టివిటీ



ఇవ్వాలని ఎంపీలు కోరారు. ప్రస్తుతం విజయవాడ నుంచి హైదరాబాద్, ఢిల్లీ, ముంబైకి నడు స్తున్న సర్వీసులను అంతర్జాతీయ విమానాల కనెక్టివిటీకి అను సంధానం చేయాలన్నారు. వచ్చే వారం రోజుల్లో ఈ విషయాలపై సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీలకు కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. అయ్యప్ప భక్తులు విమానంలో ఇరుముడులు తీసుకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసినందుకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడికి టీడీపీ ఎంపీలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## దేశంలోనే అత్యంత పొడవైన గ్లాస్ స్కై వాక్.. విశాఖలో ప్రారంభం

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దేశంలోనే అత్యంత పొడవైన గ్లాస్ స్కై వాక్‌ను విశాఖపట్నంలోని కైలాసగిరి కొండపై ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం విశాఖపట్టణాన్ని పర్యాటక రంగంలో మరింత ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో అత్యాధునిక గ్లాస్ స్కై వాక్ బ్రిడ్జిని ఏర్పాటు చేసింది. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో పీపీపీ పద్ధతిలో వీఎంఆర్‌డీఏ, ఆర్జే అడ్వెంచర్స్ సంస్థలు సంయుక్తంగా ఈ బ్రిడ్జిని నిర్మించాయి. ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వం దాదాపు 7 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. 55 మీటర్ల పొడవుతో దేశంలోనే అత్యంత పొడవైన కాంటిలివర్ గ్లాస్ స్కై వాక్ బ్రిడ్జిగా రికార్డుకె క్కింది. సముద్ర మట్టానికి 862 అడుగుల ఎత్తులో ఉన్న ఈ బ్రిడ్జి పర్యాటకులకు అందుబాటులోకి వచ్చింది. ఎంపీ భరత్ సోమవారం అధికారికంగా బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ బ్రిడ్జి 500 టన్నుల భారాన్ని మోయగలదు. అయితే, ఈ వంతెనపైకి ఒకసారి కేవలం 40 మందిని మాత్రమే అనుమతి ఇవ్వనున్నారు. ఈ బ్రిడ్జిపైకి ఎక్కి బంగాళాఖాతం, తూర్పు కనుమలు, విశాఖ నగరం అందాలను చూడొచ్చు. ఫొటోలు, వీడియోలు తీసుకోవాలనుకునే వారికి, థ్రిల్‌ను కోరుకునే వారికి ఈ బ్రిడ్జి అద్భుత మైన అనుభూతిని



ఇవ్వనుంది అనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. సూర్యోదయం, సూర్యాస్తమ సమయాలు ఈ గ్లాస్ బ్రిడ్జిపై నుంచి మరింత అద్భుతంగా కనిపిస్తాయి. బ్రిడ్జి కోసం ఉపయోగించిన గ్లాస్‌ను జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్నారు. హై క్వాలిటీ ట్రిపుల్ లేయర్, 40 ఎమ్ఎమ్ టెంపర్డ్ లామినేషన్‌తో ఈ గ్లాస్ తయారు అయింది. గ్లాసు కింద 40 టన్నుల రీఇన్ ఫోర్స్‌డ్ స్టీల్ సపోర్టు ఉంటుంది. పర్యాటకులు ఎలాంటి భయం లేకుండా బ్రిడ్జిపై చక్కర్లు కొట్టవచ్చు.

## దిత్వా తుఫాన్ ఎఫెక్ట్.. ఏపీలో భారీ వర్షాలు




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దిత్వా తుఫాన్ బలహీన పడి.. ప్రస్తుతం తీవ్ర వాయుగుండంగా కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ అధికారులు తెలిపారు. తుఫాను మరింతగా బలహీనపడి వాయుగుండంగా మారుతోందని వెల్లడించారు. ఇది ప్రస్తుతం నైరుతీ, పశ్చిమ మధ్య బంగాళాఖాతాలను ఆనుకుని కొనసాగుతోందని వివరించారు. ఈ వాయగుండం చెన్నై తీరానికి దగ్గరగా.. ఉత్తర దిశగా పయనిస్తోందని తెలిపారు. తుఫాను గంటకు ఐదు కిలోమీటర్ల వేగంతో కదులుతోందని చెప్పుకొచ్చారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. అలాగే ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని సూచించారు. దిత్వా తుఫాను ప్రభావం దృష్ట్యా ప్రజలు సరైన జాగ్రత్తలు పాటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ అధికారులు దిశానిర్దేశం చేశారు.

**విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉంది: మంత్రి గొట్టిపాటి రవికుమార్**

దిత్వా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సముద్ర తీర ప్రాంత జిల్లాల్లో విద్యుత్ సిబ్బంది ఎప్పటి కప్పుడు చర్యలు చేపడుతున్నారని వివరించారు. ఎలాంటి ఇబ్బంది వచ్చిన ఆదుకునేందుకు విద్యుత్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. సోమవారం ప్రకాశం జిల్లాలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించారు. పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు.

## ఏడుకొండల వాడి దగ్గర తప్పుకు శిక్ష తప్పదు : మంత్రి అనగాని

**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుమల పరకామణి చోరీ కేసులో సీఐడీ విచారణ గడువు రేపటితో పూర్తి అవుతున్న నేపథ్యంలో నిందితులు ఎవరనేది క్లియర్‌గా తెలుస్తుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం తిరుపతిలో ఎన్టీఆర్ వృద్ధాప్య పింఛన్ల పంపిణీలో మంత్రి పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పరకామణి చోరీ అంశాన్ని ప్రస్తావించారు. తప్పు చేసిన వారు ఎవరూ తప్పించుకోలేరని స్పష్టం చేశారు. దొంగతనం చేసిన వ్యక్తితో రాజీకి పోవడం చరిత్రలో జరగని, వినని విషయమన్నారు. విచారణ పట్ల వ్యంగ్యంగా మాట్లాడే అర్హత భూమన కరుణాకర్ రెడ్డికి లేదని అన్నారు. అన్ని అబద్ధాలు చెప్పి, భక్తుల మనోభావాలు దెబ్బతీశారని మండిపడ్డారు. సూత్రధారి, పాత్రధారి ఆయనే కాబట్టి వ్యంగ్యంగా మాట్లాడుతారని వ్యాఖ్యలు చేశారు. రేణిగుంట సబ్ రిజిస్ట్రర్ నియామకంలో ఆనంద్ రెడ్డి కోర్టును ఆశ్రయించారని.. ఆ వ్యవహారంలో తప్పు ఉంటే ఐజీ, డిఐజి చర్యలు తీసుకుంటారని తెలిపారు. కల్తీ నెయ్యి, పరకామణిలో తప్పులు



చేశామని ఒప్పుకుంటూనే, తాము చేయలేదని, ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారని అన్నారు. ఏడుకొండల వాడి దగ్గర ఎవరు తప్పు చేసిన శిక్ష అనుభవించక తప్పదని మంత్రి అనగాని సత్యప్రసాద్ హెచ్చరించారు.

## పీవీ సునీల్ కుమార్‌పై చర్యలు తీసుకోండి.. డీవోపీటీకి రఘురామ లేఖ



**అమరావతి, (రాజధాని వార్తలు):** సస్పెన్షన్‌లో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై డీవోపీటీ కార్యదర్శికి ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణమరాజు సోమవారం లేఖ రాశారు. ఈ లేఖలో కీలక అంశాలను ప్రస్తావించారు. ఇటీవల సునీల్ కుమార్ చేసిన వ్యాఖ్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి రఘురామ తీసుకెళ్లిన విషయం తెలిసిందే. కాపులు, దళితులు కలిస్తే రాజ్యాధికారం మనదేనని పీవీ సునీల్ కుమార్ చేసిన వ్యాఖ్యలను డీవోపీటీ దృష్టికి తీసుకు వచ్చారు రఘురామ. కాపులు సీఎంగా, దళితులు డిప్యూటీ సీఎంగా ఉండవచ్చని సునీల్ కుమార్ వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. ఈ వ్యాఖ్యలు అఖిల భారత సర్వీసు రూల్స్‌కు విరుద్ధమని పేర్కొన్నారు. సునీల్ కుమార్ సస్పెన్షన్‌లో ఉన్నప్పటికీ ఆయనకు ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్ ఎలా వర్తిస్తాయని ప్రశ్నించారు. రాజకీయంగా కులాలను రెచ్చగొట్టే విధంగా సునీల్ కుమార్ వ్యాఖ్యలు ఉన్నాయని ఫైర్ అయ్యారు. రాజ్యాంగ నిబంధనలకు, ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా పీవీ సునీల్ కుమార్ వ్యాఖ్యలు ఉన్నాయని.. వీటిని వెంటనే డీవోపీటీ పరిశీలించాలని కోరారు. ఈ వ్యాఖ్యల విషయంలో సునీల్ కుమార్‌ను వెంటనే సర్వీస్ నుంచి తొలగించాలని రఘురామ కృష్ణమరాజు డిమాండ్ చేశారు.

# “మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, సౌత్ మోపూర్ గ్రామంలో “రచ్చబండ : ఆనం విజయకుమార్ రెడ్డి











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రి వర్యులు, గౌరవ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వ ర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం, నెల్లూరు రూరల్ మండలం, సౌత్ మోపూర్ గ్రామంలో “రచ్చబండ” కార్యక్రమం నిర్వహించి ‘ప్రజా ఉద్యమం’ సంతకాల సేకరణ కార్యక్రమం సౌత్ మోపూర్ గ్రామ నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చెవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు రూరల్ మండల అధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, సౌత్ మోపూర్ గ్రామ బండ్ల రాజేంద్రప్రసాద్, జాన మస్తా నయ్య, కరీం భాష, సురేష్, మురళి, నాగరాజు, నాని, కిరణ్ కుమార్ రెడ్డి, సతీష్, వెంకటేష్, రామ్ కుమార్ రెడ్డి, గౌతమ్, చెవిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎం శివయ్య, షేక్ మస్తాన్, రోకటి సీనయ్య, రంగారావు, విష్ణు, రవి కుమార్, గంపల సుధాకర్, దాచుర్ వెంకటేశ్వర్లు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చండేరి ఎకో రిట్రీట్ చరిత్ర, చేనేత, సాహసాల అసమానమైన కలయికను ప్రదర్శిస్తుంది

## - ఫ్యాషన్, సంగీతం, హస్తకళలు మరియు సాహసాలతో చందేరి షిమ్మర్లు - ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ రిట్రీట్‌ను వాస్తవంగా ప్రారంభించారు - కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా అధ్యక్షత వహిస్తారు






**భోపాల్/అశోక్‌నగర్, (రాజధాని వార్తలు):** జిల్లా పరిపాలన మరియు సన్‌సెట్ ఎడారి శిబిరం సహకారంతో మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు చందేరి ఎకో రిట్రీట్ యొక్క మూడవ ఎడిషన్‌ను గొప్ప వైభవంతో ప్రారంభించారు. ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ చందేరి ఎకో రిట్రీట్‌ను వాస్తవంగా ప్రారంభించారు, ఈశాన్య ప్రాంత కమ్యూనికేషన్లు మరియు అభివృద్ధి కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా ఈ వేడుకకు అధ్యక్షత వహించారు. కటి వ్యాలీ సమీపంలో ఏర్పాటు చేయబడిన టెంట్ సిటీ దేశీయ మరియు అంతర్జాతీయ పర్యాటకులకు మూడు నెలలకు పైగా తెరిచి ఉంటుంది. చందేరి అసాధారణమైన ప్రకృతి సౌందర్యంతో ఆశీర్వదించబడిందని, ఇది పర్యాటకులకు ఆకర్షణీయమైన గమ్య స్థానంగా మారిందని ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ అన్నారు. సందర్శకులు మూడు నెలల పాటు టెంట్ సిటీని ఆస్వా దించగలరు. చందేరి చలనచిత్ర పరిశ్రమకు కూడా ఒక ముఖ్య మైన గమ్యస్థానంగా అభివృద్ధి చెందుతోందని, ఇక్కడ అనేక సినిమాలు మరియు వెబ్ సిరీస్‌లు చిత్రీకరించబడుతున్నాయని ఆయన అన్నారు. ఫ్యాషన్ పరిశ్రమ నిపుణులు కూడా ఎకో రిట్రీట్ ద్వారా చందేరికి చేరుకున్నారని ఆయన అన్నారు. చందేరి కోటలు, మెట్ల బావులు, రాజభవనాలు మరియు చారిత్రక వారసత్వం మన గొప్ప గతానికి నిదర్శనం మాత్రమే కాకుండా బుందేల్‌ఖండ్ సాంస్కృతిక శౌర్యం మరియు సౌందర్య వారసత్వా నికి సజీవ చిహ్నాలు అని కేంద్ర మంత్రి శ్రీ సింధియా అన్నారు. చందేరి కేవలం జ్ఞాపకాల ప్రదేశం మాత్రమే కాదు, భారతీయ చేతిపనులు, సంప్రదాయం మరియు కళాత్మక సున్నితత్వానికి శక్తివంతమైన ప్రాతినిధ్యం. చందేరి ఎకో రిట్రీట్ యొక్క మూడవ ఎడిషన్ ఈ వారసత్వాన్ని ప్రపంచ పటానికి తీసుకురావడానికి ఒక ముఖ్యమైన అవకాశం అని పర్యాటక, సంస్కృతి, గృహం మరియు మతపరమైన ట్రస్టులు & ఎండోమెంట్స్ అదనపు ప్రధాన కార్యదర్శి మరియు మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు మేనే జింగ్ డైరెక్టర్ షియో శేఖర్ శుక్లా అన్నారు. ఈ కార్యక్రమం చం దేరి వస్త్ర సంప్రదాయం మరియు చేతిపనులను జాతీయ మరియు అంతర్జాతీయ వేదికలపై ఉంచడమే కాకుండా ప్రాంతీయ పర్యాటకానికి కొత్త కోణాన్ని అందిస్తుంది.

**చందేరి సాంస్కృతిక సారాన్ని హైలైట్ చేసే ఫ్యాషన్ షో**

ఈ సంవత్సరం ప్రత్యేక ఆకర్షణ, “థ్రెడ్స్ ఆఫ్ టైమ్ – ది చందేరి సాగా”, ఫ్యాషన్ మరియు సంగీత ప్రదర్శన, ప్రేక్షకులను ఆకర్షిం చింది.

ఈ ప్రదర్శన చందేరి యొక్క పురాతన చేనేత నేత వారస త్వాన్ని మరియు ఐదు థీమ్-ఆధారిత విభాగాలలో దాని సమకాలీన వివరణలను ప్రదర్శించింది. ఫ్యాబ్ ఇండియా, టానేరియా, ఇటోక్రి, నోయిజ్ జీన్స్ మరియు జీస్ బై తాజ్‌వర్ వంటి ప్రముఖ బ్రాండ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఈ ప్రదర్శనలో ప్రదర్శించబడిన ఇతివృత్తాలలో ఫ్రమ్ లూమ్ టు లైఫ్, ది రాయల్ డ్రేప్స్, ది మోడరన్ మ్యూస్, థ్రెడ్స్ మీట్ డెనిమ్ మరియు జరీ జర్దోజీ ఎలిగాన్స్ ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత కళాకారులు సాంస్కృతిక మరియు సంగీత విభా గాలలో ప్రదర్శనలు ఇస్తున్నారు, వీరిలో పద్మశ్రీ అవార్డు గ్రహీత మరియు మాల్వి కబీర్ జానపద గాయకుడు కైలురామ్ బమాని యా, ఇండీ-ఫ్యూజన్ గాయకుడు మరియు ‘నోరి’ వాయిద్యం సృష్టికర్త కవిష్ సేథ్, యువ మోహన్ వీణ/సితార్ మాస్ట్రో రాఘవేంద్ర కుమార్, జానపద-ఫ్యూజన్ సంగీతకారుడు రితేష్ గోహియా మరియు అతని “సంగత్” బ్యాండ్ మరియు సూఫీ-జానపద కథకుడు ప్రతిభా పాఠక్ ఉన్నారు. అతిథులు చందేరి యొక్క సుందరమైన అందం మధ్య విలాసవంతమైన గ్లాంపింగ్ అనుభవాన్ని పొందుతారు. సుందరమైన లోయలు మరియు చందేరి చారిత్రక వారసత్వం మధ్య ఉన్న టెంట్ సిటీ అతిథులకు విలాసవంతమైన గ్లాంపింగ్ అనుభవాన్ని అందిస్తోంది. ఈ సంవత్సరం చందేరి ఎకో రిట్రీట్ ఫెస్టివల్ మరోసారి ఆకట్టుకునే ఫార్మాట్‌లో నిర్వహించబడుతోంది. సాంస్కృతిక మరియు కళాత్మక కార్యక్రమాలతో పాటు, పర్యాటకులు టెంట్ సిటీలో సాహస కార్యకలాపాలను కూడా ఆస్వాదిస్తున్నారు. హాట్ ఎయిర్ బెలూన్ గ్లో షోలు, ఏటివి రైడ్‌లు, జిప్‌లైనింగ్ మరియు ఎయిర్‌గన్ షూటింగ్ వంటి ఉత్తేజకరమైన అనుభవాలు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి. పర్యాటకులు బాఘేల్‌ఖండ్ మరియు బుందేల్‌ఖండ్ వంటకాల రుచికరమైన వంటకాలను కూడా ఆస్వాదిస్తున్నారు. కుటుంబాలు మరియు పిల్లలు ఆనందిం చడానికి ఇండోర్ మరియు అవుట్‌డోర్ ఆటలతో పాటు ప్రత్యేక కిడ్స్ జోన్ ఏర్పాటు చేయబడింది.


# ఘనంగా “బాల్య వివాహ ముక్త భారత్”




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ట్రస్ట్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సంయుక్తంగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సామర్ల కోట మండలం మాధవ పట్నం జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్‌లో బాల్య వివాహ ముక్త భారత్ ప్రతిజ్ఞ, ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ జి.ఉష, గ్రామ సర్పంచి యమ్ సుగుణమ్మ, యమ్‌పిటిసి జి కృష్ణ అర్జునరావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపివో ఉష మాట్లా డుతూ నవంబర్ 27, 2024 నుండి “బాల్య వివాహ ముక్త భారత్” అనే కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. దేశంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బాల్య వివాహ నిరోధ చట్టం 2006 ప్రకారం బాల్యవివాహాలు ఒక సాంఘిక దురాచారం నేరం, బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరే కంగా సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేయాలన్నారు. బాల్య వివాహం జరగడానికి చేసిన ఏ ప్రయత్నాన్నైనా పంచాయతీ, ప్రభుత్వ అధికారులకు తెలియపరచాలని లేదంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా 27 నవంబర్ 2025 నుండి 8 మార్చ్ 2026 వరకు 100 రోజుల అవగాహన కార్యక్రమాలును క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించడం జరుగుతుం దన్నారు. బాల్య వివా హాలు జరగకుండా కాపాడాల్సిన బాధ్యత సమాజ ములో అందరిపైన ఉందన్నారు. ఎవరైనా బాల్య వివాహా లను ప్రోత్సహించిన మరియు సహకరించిన లేదా 18 సంవత్స రాలు అమ్మాయికి నిండకుండా, 21 సంవత్సరాలు పూర్తి కాకుండా అబ్బాయికి వివాహం చేసిన బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం లేదా పోక్సో చట్టం చర్యలు తీసుకుం టామని తెలియజేసారు. బాలల విద్య, భద్రత కోసం ప్రతీ పౌరుడు గళాన్ని వినిపించాలని, బాల్య వివాహ ఆంధ్రప్రదేశ్ సాకారానికి మద్దతు ఇవ్వాలని అన్నారు. అందులో బాగంగానే ఈరోజు జిల్లా లోని అన్ని గ్రామాలలో క్యాండిల్ లైట్ ర్యాలీ, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ కమ్యూనిటీ సోషల్ వర్కర్ బి లక్ష్మి, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, సూపర్వైజర్ నళిని, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో పిఎల్ ల్యాబ్ ప్రారంభం

**చేజర్ల, (రాజధాని వార్తలు):** చేజర్ల మండలం ఆదురుపల్లిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు 30 ట్యాబులను సమగ్ర శిక్ష నెల్లూరు వారు అందించడం జరిగింది. ఈ ట్యాబులను 6 నుండి 9 వ తరగతి వరకు విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు మరియు గణితం సబ్జెక్టులు సులభంగా నేర్చు కోవడానికి మరియు మరింతగా శిక్షణ పొందేందుకు అందజే యడం జరిగిందని అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్ బాబు తెలియజేశారు. ఈ పిఎల్ ల్యాబ్‌ను సమగ్ర శిక్ష అకాడమిక్ మోనిటరింగ్ అధికారి సుధీర్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ, డిసిఓ ప్రభావతమ్మ, చేజర్ల విద్యాశాఖ అధికారులు డి సి మస్తానయ్య, జి ఇందిర, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ శ్రీనివాసులురెడ్డి మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



# గర్భి గేమ్‌లో వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వైష్ణవి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** 69వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి స్కూల్ గర్భిగేమ్ ఫెడరేషన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వదలకూరు నందు రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వీరంపల్లి మనుబోలు మండలంలోని ఎనిమిదవ తరగతి చదువుతున్న కాంద్రాది వైష్ణవి అండర్ 17 కాల్స్ విభాగంలో నెల్లూరు టీం నందు ఆడి రాష్ట్రస్థాయిలో ఈ టీం మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్ శ్రీధర్ అండ్ పి రమేష్ ఈ గేములు నిర్వహించారు వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు శ్రీధర్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ కాంతారావు మరియు ఉపా ధ్యాయులు విద్యార్థులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# బాధితునికి రూ.30 వేలు సహాయం అందచేసిన వైస్సార్సీపీ సీనియర్ నాయకులు :కుంచే రమణారావు



**అమలాపురం, (రాజధాని వార్తలు):** దీపావళి బాణాసంచా పేలి గాయాలు పాలై ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్న అమలాపురం తొమ్మిదవ వార్డుకు చెందిన కుంచే రమేష్ కుమారుడు రణదీప్ దాస్ ను శనివారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైసిపి నాయకుడు,గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శించారు. బాధితుడు రమేష్‌కు వైద్యం నిమిత్తం రూ. 30 ఆర్థిక సహాయాన్ని రమణారావు అందచేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాయం అందించిన రమణారావు కు రమేష్ అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్,మాకే సిద్దు,గూటం సాయి,గంటి చిరంజీవి,కంచర్ల జాన్సన్, గంటా లక్ష్మీ ప్రసాద్,నేరేడుమిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# భద్రాచలం సర్పంచ్ పదవికి రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన భూక్య శ్వేత



**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం సర్పంచ్ ఎన్నికల నామినేషన్ చివరి రోజు సందర్భంగా భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా మాజీ సర్పంచ్ భూక్య శ్వేత సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా భూక్యవేత మాట్లాడుతూ గతంలో తన సర్పంచ్ పదవి కాలం గ్రామాభివృద్ధి కోసం ఎన్నో శాశ్వత కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు పల్లె పచ్చదనం తాగునీటి సమస్యలు రహదారి మరమ్మత్తులు, విద్యుత్ సౌకర్యాలు మహిళ స్వయం సహాయక సంఘాలు బలోపేతానికి తాము ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు తెలిపారు గ్రామ ప్రజల నమ్మకం ఆశీర్వాదాలు తమకు బలమని తిరిగి ప్రజాసేవ కోసం ముందుకు వస్తున్నానని అన్నారు గ్రామ అభివృద్ధి వేగవంతం చేయడం పారదర్శక పాలన సమస్యల పరిష్కారానికి తక్షణ స్పందన తన ప్రధాన లక్ష్యమని కూడా బుక్య శ్వేత స్పష్టం చేశారు నామినేషన్ కార్యక్రమంలో గ్రామ పెద్దలు స్థానిక నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో గ్రీన్ భద్రాద్రి సేవలు అభినందనీయం

**- డెక్కా నరసింహారావు, గగ్గూరి బాలకృష్ణ. టి.ఎన్. జి ఓ అధ్యక్ష కార్యదర్శులు**





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** స్థానిక టి. ఎన్. జి. ఓ కార్యాలయంలో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో ఈరోజు మొక్కలు నాటడం జరిగింది. భద్రాచలం పట్టణంలో గత 14 సంవత్సరాలనుండి గ్రీన్ భద్రాద్రి చేస్తున్న కార్యక్రమాలు వెల కట్టలేనివని, పర్యావరణం కాపాడటానికి మనమందరం కృషి చేయాలని,విరివిగా మొక్కలు నాటి, కాలుష్యాన్ని తొలగించి, మంచి వాతావరణం కల్పించవలసిన భాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, లేకపోతే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవని, ఈ సంవత్సరం గ్రీన్ భద్రాద్రి తొలి మహిళా అధ్యక్షురాలు చిట్టే లలిత భద్రాచలం పట్టణంలో విశేషంగా మొక్కలు నాటుతూ మంచి కార్యక్రమాలు చేస్తుండటం అభినందనీయం అని టి.ఎన్.జి.వో. అధ్యక్ష కార్యదర్శులు డెక్కా నరసింహారావు, గగ్గూరి బాలకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షురాలు చిట్టే లలిత, గ్రీన్ భద్రాద్రి పూర్వ అధ్యక్షులు గోళ్ళ భూపతిరావు,గౌతమి రామకృష్ణారెడ్డి, గాలి రామ్ మోహన్ రావు, గ్రీన్ భద్రాద్రి కో ఆర్డినేటర్ పామరాజు తిరుమల రావు, టి. ఎన్.జి.వో. నాయకులు పడిగ నరసింహారావు ప్రమోద్ కుమార్ కిరణ్ శ్రీనివాస్ రామకృష్ణ సాదిక్ పాషా వెంకటేష్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ ఎంపీడీవో గా సూర్యనారాయణమూర్తి





**అయినవిల్లి, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం కార్యదర్శి రేమెళ్ళ సూర్యనారాయణ మూర్తికి డిప్యూటీ ఎంపీడీవో గా పదోన్నతి రావడం పై పలువురు హర్షం వ్యక్తం చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా అయినవిల్లి లంక గ్రామంలో కార్యదర్శిగా పనిచేస్తూ అందరి మన్ననలు పొందారని నిబద్ధతతో అంకితభావంతో పనిచేసేవారని సర్పంచ్ కుమ్మరి శ్రీవాణి మాధవి లత అన్నారు. అయినవల్లి లంక గ్రామంలో పనిచేస్తూ పి.గన్నవరం డిప్యూటీ ఎంపీడీవో పదోన్నతి పై వెళ్లడంతో ఆనందం వ్యక్తం చేశారు. గాశనివారం పంచాయతీ కార్యాలయంలో పదోన్నతిపై వెళ్తున్న కార్యదర్శి సూర్యనారాయణమూర్తిని ఘనంగా సన్మానించారు. ఈయన అంబాజీపేట మండలం గంగలకుర్రులో కార్యదర్శిగా ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారన్నారు. తధానంతరం విలస ఎస్ మూలపాలెం తొత్తరమూడి కొమరగిరిపట్నం నాగం అయిన వేల లంక గ్రామాలలో పంచాయతీ కార్యదర్శి గా పనిచేసే అందరి మన్ననలు



పొందారన్నారు. ఈ సందర్భంగా అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ ఎంపీటీసీ దాసరి శైలజ వీరస్వామి కుమ్మరి వెంకటరమణ మండల టిడిపి అధ్యక్షుడు వస్కాశ్యామ్ కోడూరి సోమేశ్వరరావు గోడి వరప్రసాద్ జిత్తుక ప్రసాద్ వార్డు సభ్యులు సచివాలయ అంగన్వాడి ఆశ శానిటేషన్ సిబ్బంది మరియు నక్క దుర్గా ప్రసాద్, మచ్చా ప్రభాకర్, బొంతు కిరణ్, మచ్చా శ్రీను,ఆయనను ఘనంగా సన్మానించారు.

# మావుడి సోదరులను పరామర్శించిన ప్రముఖులు





**మక్కువ, (రాజధాని వార్తలు):** మావుడి సోదరుల మాతృమూర్తి ఇటీవల కీర్తిశేషులు శ్రీ మావుడి అరుణమ్మ స్వర్గస్తురాలు అయిన నేపథ్యంలో ఈరోజు పార్వతీపురం వైయస్సార్సీపి మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, వైఎస్ఆర్సిపి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్. మావూడిసోదరుల ఇంటికి వచ్చి అరుణమ్మ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. మావూడి సోదరులకు ఈ శోక సమయంలో తట్టుకొని మనో ధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలి అని ప్రార్థించారు. వీరితో పాటు దండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఈవిఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్






**నెల్లిమర్ల, (విజయనగరం), (రాజధాని వార్తలు):** స్థానిక ఈవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. గోదాము షట్టర్లకు వేసిన సీళ్లను, తాళాలను పరిశీలించారు. పోలీసు బందోబస్తుపై సమీక్షించారు. సిసి కెమేరాల ద్వారా చుట్టుప్రక్కల పరిస్తితులను పరిశీలించారు. అంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

ఆర్డిఓ డి.కీర్తి, నెల్లిమర్ల తాహసీల్దార్ శ్రీకాంత్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటిండెంట్ భాస్కర్రావు, ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్సాహంగా ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం నిర్వహించిన ఉపాధ్యాయుల మండల స్థాయి క్రికెట్, త్రో బాల్ పోటీలు మండలంలో ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగాయి. ఈ పోటీల్లో పురుష ఉపాధ్యాయులు కోసం నిర్వహించిన క్రికెట్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే మహిళా ఉపాధ్యాయినీలు కోసం నిర్వహించిన త్రోబాల్ పోటీలు కూడా అంతే ఉత్సాహంగా జరిగాయి. పోటీలు అనంతరం డివిజనల్ స్థాయికి వెళ్లే జట్లను క్రీడా ఉపాధ్యాయుల, ఉపాధ్యాయినీల ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఎస్.విమలమ్మ, బి.సాయి చక్రధర్, మండల ఇంచార్జ్ చింత సత్యనారాయణ, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

**- ప్రజాదర్బార్ లో అందిన వినతుల పరిష్కారానికి కృషి చేస్తాను : మంత్రి కొండపల్లి**




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ, సర్ప్, ఎన్.ఆర్.ఐ వ్యవహారాల శాఖ మాత్యులు కొండపల్లి శ్రీనివాస్ శనివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. అర్జీదారులు తమ సమస్యలపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు అధిక సంఖ్యలో వినతలు అందజేశారు. అర్జీదారుల ప్రతి ఒక్కరి వినతిని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్వయంగా విని ఆ తర్వాత వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజా దర్బార్లో అందజేసిన వినతుల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తమ కూటమి పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఆ దిశగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సీ. చైర్మన్ పి.వి.వి గోపాలరాజు, మాజీ ఎం.పీ.పీ లు మక్కువ శ్రీధర్, గంట్యాడ శ్రీదేవి, మండల పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, రాపాక అచ్చంనాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జోరుగా కోటి సంతకాల సేకరణ



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మండలంలో జోరుగా సాగుతుంది. ఇందులో భాగంగా శనివారం గజపతినగరం పట్టణంలోని సిమెంట్ రోడ్లో షాపులకు వెళ్లి ఆ పార్టీ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు ఈ కార్యక్రమంలో వైయస్సార్ సీనియర్ నాయకులు ఎంపీటీసీ గేదెల జగదీశ్వరరావు, వివర్స్ వింగ్ అధ్యక్షులు ఉజ్జూరు శ్రీనివాసరావు, రూమ్కాన భాస్కరరావు (బాబు), ఆల్తి రామనాయుడు గేదెల వాసు బూర్ల గణేష్ బూర్ల పైడ్రాజు గోపి వాసు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## టెంబా టీమ్ దక్షిణాఫ్రికా క్రికెట్‌కు జేజేలు

నేను చదివిన అత్యుత్తమ స్పోర్ట్స్ పుస్తకాలలో ఒకటి జాన్ కార్లిన్ రాసిన 'ప్లేయింగ్ ది ఎనిమీ: నెల్సన్ మండేలా అండ్ ది గేమ్ దట్ మేడ్ ఎ నేషన్'. దక్షిణాఫ్రికా ఆతిథ్యమివ్వడంతో పాటు విజయం సాధించిన చరిత్రాత్మక 'రగ్బీ వరల్డ్ కప్-1995' గురించిన విపుల కథనమిది. రగ్బీ అనేది దక్షిణాఫ్రికాలో అమానుష జాతి వివక్షా వ్యవస్థకు కారకులైన జాత్యహంకార, ఆధిపత్య వాద ఆఫ్రికానర్ల(దక్షిణాఫ్రికాలో నివసించే డచ్ మూలాలున్న శ్వేతజాతి సమూహం) ఆట. మనకు నమ్మడానికి కష్టంగా అనిపించే ఓ వ్యక్తి, ఆ ఆటకు అభిమానిగా ఉన్నారు. ఆయన ఎవరో కాదు, నెల్సన్ మండేలా! ఆఫ్రికానర్ల వివక్షాపూరిత పాలనలో దశాబ్దాల పాటు జైలులో మగ్గిపోయిన మండేలా రగ్బీకి ఎలా అభిమాని అయ్యారనే విషయాన్ని కార్లిన్ చాలా సున్నితంగా వివరించారు. జైలు నుంచి విడుదలైన తరువాత దక్షిణాఫ్రికా అధ్యక్షుడుగా మండేలా ఎన్నికయ్యారు. దేశాధ్యక్షుడి హోదాలో ఆయన శ్వేతజాతీయుల ప్రాబల్యంలో ఉన్న రగ్బీ టీమ్‌కు అనధికారిక చిహ్నం (మస్కట్) అయ్యారు. టీమ్ కెప్టెన్ ఆఫ్రికానర్ అయిన ఫ్రాంకోయిస్ పియెనార్‌తో ఆయన ప్రత్యేక స్నేహ సంబంధాలు నెలకొల్పుకున్నారు. కార్లిన్ పుస్తకం (దీని ఆధారంగా నిర్మించిన 'ఇన్విక్టస్' అనే ఫీచర్ ఫిల్మ్‌లో మండేలాగా మోర్గాన్ ఫ్రీమన్ నటించారు) రగ్బీ ఆటను దాని సామాజిక, రాజకీయ సందర్భంతో చక్కగా మేళవించింది. మహోన్నత దార్శనిక నేత అయిన నల్లజాతి రాజకీయవేత్త, పక్షపాత రహితంగా ఆలోచించే శ్వేతజాతి క్రీడాకారుల మధ్య సన్నిహిత స్నేహ సంబంధాలు- గతంలో పరస్పర విరోధులుగా ఉన్న వేర్వేరు జాతి సమూహాలను ఎలా సమైక్యపరిచాయో సవివరంగా వెల్లడించింది. క్రికెట్ గ్రౌండ్స్‌లో అత్యంత పవిత్రమైనది, ప్రతిష్ఠాత్మకమైనదిగా భావించే 'లార్డ్స్'లో దక్షిణాఫ్రికా జట్టు ఈ ఏడాది 'వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్' (డబ్ల్యూటీసీ)ను గెలుచుకున్న సందర్భంలో కార్లిన్ పుస్తకాన్ని జ్ఞాపకం చేసుకున్నాను. ఈ క్రికెట్ విజయానికి 1995 నాటి రగ్బీ విజయానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యం గానీ, సామాజిక ప్రభావం గానీ లేవు. ఇది పూర్తిగా క్రికెట్ విజయం. అయినప్పటికీ ఇది, జాతీయవాద ఆర్భాటాలు, ఉన్మాదాలు లేని క్రికెట్ ప్రేమికులకు ఎల్లెడలా ఎనలేని ఆనందోత్సాహాలను ఇచ్చింది. ఇందుకొక కారణమున్నది. తమను తాము క్రికెట్ ప్రపంచ గొప్ప అగ్రత్రయంగా భావించుకునే ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, భారత్‌లు- దక్షిణాఫ్రికా క్రికెటర్లు అంతగా గౌరవించదగినవారు కాదని విశ్వసించడం కద్దు. ఈ మూడు దేశాలు వారికి రెండు లేదా మూడు టెస్ట్‌ల సిరీస్ కంటే ఎక్కువ ఇచ్చేవి కావు. దక్షిణాఫ్రికా తన డబ్ల్యూటీసీ విజయాన్ని డిఫెండింగ్ ఛాంపియన్స్ ఆస్ట్రేలియాపై సాధించడం నన్ను ఎంతో ఉద్వేగపరిచింది. అందునా విజేత జట్టుకు నల్లజాతీయుడు అయిన టెంబా బవుమా నేతృత్వం వహించడం నాకు ప్రత్యేకంగా అమితానందాన్ని కల్పించింది. జట్టును విజయానికి నడిపించడంతో పాటు జాతిపరంగా వైవిధ్య నేపథ్యాలు ఉన్న 11 మంది ఆటగాళ్లు విజయానికి పోరాడేలా చేయడంలో బవుమా వ్యవహరించిన తీరు ప్రశంసార్హమైనది. డబ్ల్యూటీసీ ఫైనల్‌ను దాదాపు పూర్తిగా టెలివిజన్‌లో వీక్షించాను. అది టెస్ట్ క్రికెట్ కావడం ఒక కారణమైతే, దక్షిణాఫ్రికా జటిల చరిత్రలో నాకు ఎంతో కాలంగా ఆసక్తి ఉండడం మరొక కారణం. ఎయిడెన్ మార్క్రమ్, టెంబా బవుమాలు తమ పరుగుల వేటను జయప్రదంగా పూర్తి చేయడాన్ని చూసిన తరువాత ఎంతో సంతృప్తితో ఆనందంతో భోంచేసి నిద్రపోయాను. ఆ మరుసటి ఉదయం నా ఫోన్‌పై వార్తలు చూసినప్పుడు క్రితం రాత్రి నేను పొందిన ఆనందోత్సాహాల అనుభూతులు ఒక్కసారిగా రోత పుట్టే తీరులో అణగారిపోయాయి.. సౌందర్యపరంగా, రాజకీయంగా అవి ఉల్లంఘనకు గురయ్యాయి. ఈ నా చేదు అనుభవాన్ని మరికొంచెం వివరిస్తాను. డబ్ల్యూటీసీ ఫైనల్‌ను గౌరవించే పేరిట అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఒక వీడియోను సామాజిక మాధ్యమాలలో పెట్టింది. అందులో ప్రధాన పాత్రలు వహించింది టెంబా, ఆయన సహచర ఆటగాళ్లు అనుకుంటున్నారా? కానేకాదు. మరి ఎవరో ఊహించగలరా? జై షా! అవును, ఐసీసీ అధ్యక్షుడు. 45 సెకన్ల ఆ వీడియోలో కన్పించే 23 షాట్‌లలో 11 పూర్తిగా షాను ఒక స్టార్‌గా చూపిస్తున్నవేనని ఒకరు లెక్క వేశారు. క్రికెట్ బ్యాట్‌ను ఎలా పట్టుకోవాలో లేదా 22 గజాల పిచ్‌పై ఎలా బౌలింగ్ చేయాలో జై మహాశయునికి తెలీదు. అయితే ఆయన ఐసీసీ అధ్యక్షుడు కదా. ప్రపంచ క్రికెట్‌ను సమర్థంగా నడిపిస్తున్నది బీసీసీఐ (భారత క్రికెట్ నియంత్రణ మండలి). మరి బీసీసీఐని (తద్వారా ఐసీసీని) అమోఘంగా నడిపిస్తున్నది భారతీయ జనతా పార్టీ. బీజేపీలో (ఆ కారణంగా భారత్‌లో) అత్యంత శక్తిమంతుడైన రెండవ వ్యక్తి జై షా తండ్రి. బవుమా, మార్క్రమ్, రబాడ, మహరాజ్, తదితర దక్షిణాఫ్రికా జట్టు సభ్యుల విజయోత్సాహాన్ని ఒక భారతీయ రాజకీయవేత్త కుమారుడి వినయరాహిత్యం, మొరటుతనం, తనను తాను గొప్ప చేసుకునే స్వభావం భగ్నం చేసింది, భ్రష్టపరిచింది. జై షా తీరును అనేక మంది ఆక్షేపించారు. అయితే బీసీసీఐ పెత్తందారులు చాలా కాలంగా దక్షిణాఫ్రికా క్రికెటర్లను చులకనగా చూస్తున్న తీరుతెన్నులకు జై షా అభ్యంతరకర వ్యవహారం కేవలం పరాకాష్ఠ మాత్రమే అన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. దక్షిణాఫ్రికాలో ఇండియా 2012లో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో ఆడవలసి ఉంది. వెస్టిండీస్‌తో ఒక సిరీస్‌ను హడావుడిగా ముంబైలో ఏర్పాటు చేశారు. కారణమేమిటి? సచిన్ టెండూల్కర్ తన 200వ టెస్ట్ మ్యాచ్‌ను ముంబైలో ఆడే వీలు కల్పించేందుకే. 2025 సంవత్సరాంతంలో కూడా మన దేశంలో పర్యటించిన దక్షిణాఫ్రికా జట్టుకు రెండే రెండు టెస్ట్‌ల సిరీస్ ఇచ్చారు.

# ఆల్టర్‌నేటివ్ మెడిసిన్‌లో డాక్టరేట్ పట్టా పొందిన డాక్టర్ సునీత సారికి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మానవాళికి అత్యంత సురక్షితమైన ఆల్టర్‌నేటివ్ మెడిసిన్లో డాక్టర్ సునీత సారికి నార్త్ అమెరికాలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మెడిసినా ఆల్టర్నేటివా అజ్టెకా యూనివర్సిటీ నుంచి అత్యున్నత డాక్టరేట్ పట్టా పొందారు. మానవులను వేధిస్తున్న ప్రమాదకరమైన బ్రెయిన్ స్ట్రోక్ వ్యాధిపై ఆల్టర్‌నేటివ్ మెడిసిన్‌తో తాను చేసిన పరిశోధనలకు గాను ఈ డాక్టరేట్‌ను తనకు ప్రధానం చేశారన్నారు. ఆమె శనివారం మీడియాతో మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో మానవాళికి వస్తున్న అతి ప్రమాదకరమైన వ్యాధులకు వాడుతున్న పలు ఆధునిక ఔషధాల వల్ల ఆయా వ్యాధులు తగ్గుతున్నప్పటికీ, తరువాత మరికొన్ని ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. వీటిని సమర్ధవంతంగా నిరోధించేందుకు ఆక్యుపంచర్, ఆక్యుప్రెజర్, హిజామా తదితర 52 రకాల సురక్షితమైన ఆల్టర్ నేటివ్ థెరపీస్‌ను తాను నిర్వహిస్తానన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన వరల్డ్ కాంగ్రెస్ వైద్య సదస్సులో తాను పాల్గొని పలు పరిశోధనా పత్రాలను సమర్పించా నన్నారు. సన్ఫో గ్లోబల్ ఫెడరేషన్ వారు సన్ఫో సపోర్టివ్ ఫెలో షిప్ ను తనకు ఇచ్చి గౌరవించారన్నారు. ట్రెడిషనల్ మెడిసిన్‌లో డాక్టర్ అఫ్ ఫిలాసఫీ పొందానన్నారు. సన్ఫో ఇంటర్నేషనల్ లైఫ్ ఫెలో షిప్ అవార్డ్ -2025 వచ్చిందన్నారు. ఆంధ్రా తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం ఐదుగురు పాల్గొనగా వారిలో మన రాష్ట్రంలోని విశాఖపట్నం నుంచి నేను మాత్రమే పాల్గొన్నా నన్నారు. ది ఓపెన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఫర్ కాంప్లిమెంటరీ మెడిసిన్స్ విభాగంలో కూడా పలు అవార్డులు రావడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు.

# 24 గంటలలోపు ఇచ్చిన హామీ నేరవేర్చిన గంకల కవిత అప్పారావు యాదవ్


**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఉత్తర నియోజకవర్గం 48వ వార్డు పరిధిలో గల కొండ వాలు ప్రాంతం ఇందిరా నగర్ -5, ఏఎస్ఆర్ కాలనీ, మహాత్మ గాంధీ నగర్, జవహర్ లాల్ నెహ్రూ నగర్, పలు ప్రాంతలలో 48వ వార్డ్ కార్పొరేటర్,జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, భారతీయ జనతా పార్టీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు యాదవ్ శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ పర్యటనలో వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదని గుర్తించారు. తక్షణమే ఈ విషయంపై గంకల కవిత అప్పారావు యాదవ్ అధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కా రం చూపాలని కోరి 24 గంటలలో సమస్య పరిష్కారం చూపు తామని గంకల కవిత అప్పారావు యాదవ్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావు సుడిగాలి పర్యటనపై అధికారులు స్పందించి శనివారం వార్డులో పర్యటించి వీధి దీపాలు మరమ్మత్తులు చేపట్టారు. ఈ సందర్భంగా గంకల కవిత అప్పా రావు యాదవ్ మాట్లాడుతూ గుడ్ మార్నింగ్ గంకల కార్యక్ర మంలో వచ్చిన పిర్యాదు మేరకు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సుడిగాలి పర్యటన చేయడం జరిగిందని ఈ పర్యటనలో వీధి దీపాలు మరమ్మత్తులకు గురి అవ్వడం గుర్తించడం జరిగిందని, దీనిపై అధికారులకు పిర్యాదు చేసి ప్రజలకు 24గంటలలో పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడం జరిగిందని, ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు శనివారం అధికా రులతో కలిసి పర్యటించి జైఇందిరా నగర్ -5, ఏఎస్ఆర్ కాలనీ, మహాత్మ గాంధీ నగర్, జవహర్ లాల్ నెహ్రూ నగర్, పలు ప్రాం తాలలో వీధి దీపాలు మరమ్మత్తులు చేసి సమస్య పరిష్కారించడం జరిగిందన్నారు. గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమం ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకొని



సంబంధిత అధికారులకు తెలపడం జరిగిందని మరియు కొన్ని నేరుగా సమీక్షించి సమస్య నెరవేర్చడం జరిగిందని అన్నారు. వార్డ్ ప్రజ లకు ఎటువంటి సమస్య ఏర్పడిన తక్షణమే తనను సంప్రదిం చాలని అన్నారు. వార్డ్ ప్రజలు పిర్యాదు పట్ల తక్షణమే చర్యలు చేపట్టి 24 గంటలలోపు ఇచ్చిన హామీ నేరవేర్చిన గంకల కవిత అప్పారావు యాదవ్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జై ఇందిరా నగర్ -5, ఏ ఎస్ ఆర్ కాలనీ, మహాత్మ గాంధీ నగర్, జవహర్ లాల్ నెహ్రూ నగర్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# విశాఖలో అట్టహాసంగా లాడియ డైమండ్ జువెల్లరి ప్రారంభం

## - సందడి చేసిన సినీనటి సంయుక్త మీనన్




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ, ద్వారకా నగర్‌లోని లాడియ డైమండ్ జువెల్లరి శనివారం ఉదయం అట్టహసంగా ప్రారం భమైంది. సినీనటి సంయుక్త మీనన్‌తో కలసి లాడియ జువెల్లరి డైరెక్టర్ అఖిల్ వేములూరి రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఫ్రీ లాంచ్ ఈవెంట్‌లో సంయుక్త మీనన్ ఫోటోలకు పోజులిచ్చి సందడి చేశారు. అనంతరం అఖిల్ వేములూరి మీడియాతో మాట్లాడుతూ భారతదేశం వజ్రాల ల్యాబ్ -గ్రోన్ వజ్రాల రంగంలో గణనీయమైన పురోగతిని సాధించిందన్నారు. ఈ రంగంలో వినూత్న ఆలోచనలతో విభిన్న ఆవిష్కరణలకు లాడియ కట్టుబడి ఉన్నాదని తెలియజేయడానికి సంతోషిస్తున్నామన్నారు. సహజ వనరుల నివారణ, హానికరమైన మైనింగ్ పద్ధతులను తగ్గించడం ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ ప్రత్యేకత అని తెలిపారు. లాడియ ల్యాబ్లో రూపుదిద్దుకునే వజ్రాభరణాలు కచ్చితమైన నాణ్యతా ప్రమాణాలతో తయారు చేయబడతాయని అఖిల్ చెప్పారు. ఇక్కడ ఎంతో నైపుణ్యం కలిగిన శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వజ్రాభరణాలు తయారు చేస్తారని తెలిపారు. ఈ ల్యాబ్లో తయారు చేయబడే సహజమైన ప్రకృతి సిద్ధమైన వజ్రాభరణాలు మేలు కలిగిస్తాయని పేర్కొన్నారు. ల్యాబ్‌లో చేయబడిన వజ్రాలు సహజ వజ్రాల వలె అదే రంగు, స్పష్టత స్థాయిని ఉపయోగించి కూడా గ్రేడ్ చేయబడినవని అఖిల్ తెలిపారు. లాడియలో తయారు చేయబడిన బంగారు వజ్ర ఆభరణాలు విస్తృత ఎంపికతో లభిస్తాయని చెప్పారు. నెక్లెస్లు, బ్యాంగిల్స్, పెండెంట్లు, కంకణాలు, చెవిపోగులు, ఝుమ్కాస్, ఉంగరాలు ప్రత్యేకమైన ల్యాబ్లో పోల్కిస్, కస్టమైజేషన్-మేక్ యూరోన్ డిజైన్లలో అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. నవంబరు 29 నుంచి డిసెంబర్ 14 వరకు వజ్రాలు, మేకింగ్ చార్జీలపై 15శాతం తగ్గింపును ప్రకటించారు. నటి సంయుక్త మీనన్ మాట్లాడుతూ మహిళలు మెచ్చే వివిధ డిజైన్లతో కూడిన డైమండ్ జువెల్లరి లాడియలో అందుబాటు ధరలో లభిస్తాయని పేర్కొన్నారు. పెళ్లిళ్లు, పండగ సీజన్లలో అందరూ మెచ్చేలా డైమండ్ జ్యువెలరీ విక్రయాలకు లాడియ ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ జ్యువెలరీ డైమండ్ షోరూమ్ ను విశాఖ వాసులు సందర్శించి, ఆదరించాలని కోరారు. అఖిల్ వేమూలూరి సతీమణి సాత్విక పాల్గొన్నారు.




# బాధితునికి రూ.30 వేలు ఆర్థిక సహాయం అందచేసిన రమణారావు



**అమలాపురం, (రాజధాని వార్తలు):** దీపావళి బాణాసంచా పేలి గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్న అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం తొమ్మిదవ వార్డుకు చెందిన కుంచే రమేష్ కుమారుడు రణదీప్ దాస్‌ను శనివారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైసిపి నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శించారు. బాధితుడు రమేష్‌కు వైద్యనిమిత్తం రూ.30 ఆర్థిక సహాయాన్ని రమణారావు అందచేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సహాయం అందించిన రమణారావుకు రమేష్ అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్, మాకే సిద్దు, గూటం సాయి, గంటి చిరంజీవి, కంచర్ల జాన్సన్, గంటా లక్ష్మీ ప్రసాద్, నేరేడుమిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి నేతల కీచక పర్వం.. మహిళ కన్నీటి పర్యంతం : జమ్మలమడక నాగమణి



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** కూటమి కీచక నేతల దుశ్చర్యతో రాష్ట్రంలో మహిళకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి. ఆమె విడుదల చేసిన పత్రికా ప్రకటనలో కూటమి నేతలు దురాగతాలను ఎండగట్టారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలపై అఘాయిత్యాలకు పచ్చ జెండా ఊపి నట్టు కూటమి నేతలు రెచ్చిపోతున్నారని మండిపడ్డారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మొదలు, గుంటూరు ఎమ్మెల్యే అహ్మద్ నజీర్ వరకు ప్రజాప్రతినిధులే గాడి తప్పి ప్రవర్తించచడం సిగ్గుచేటన్నారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్న చందంగా ప్రజాప్రతినిధుల తీరు ఈ విధంగా ఉంటే చోట నేతలు ఒంటరి మహిళలు, స్కూల్ పిల్లలు, కాలేజ్ విద్యార్థినులు ఇలా ప్రతీ ఒక్కరిని లైంగికంగా వేధించడం నిత్యకృత్యంగా మారడం దురదృష్టకరం అన్నారు. ఉపాధి, విద్య, వైద్యం ఇలాంటి అవసరాలకు ప్రజాప్రతినిధులు వారి అనుచరుల వద్దకు వెళ్తున్న మహిళలని లైంగిక వేధింపులకు గురించి చేయడం పరిపాటిగా మారిందన్నారు.

ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రి చంద్ర బాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నోరు మెదపకపోవడమేంటని ప్రశ్నించారు నాగమణి. మహిళ అర్ధరాత్రి నడి రోడ్డుపై ఒంటరిగా నడిచి వెళ్లిన నాడే మనకు స్వాతంత్ర్యం వచ్చినట్టు అని మహాత్మా గాంధీజీ మాటలు గుర్తు చేస్తూ, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పగటి పూట మహిళ స్వేచ్ఛగా తిరగలేని దుస్థితి ఏర్పడింది అన్నారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమం తరహాలో మహిళల రక్షణకు మరో ఉద్యమ చేపట్టాల్సిన అవసరం ఉందని నాగమణి పేర్కొన్నారు.

# ట్రాఫిక్ నియంత్రించేందుకు నూతన వంతెనల నిర్మాణానికి సహకరించండి

**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలో తీవ్ర ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు నూతన వంతెనల నిర్మాణానికి నిధు లు మంజూరు చేసే సహకరించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు రహదారుల శాఖ మంత్రి బి జనార్దన్ రెడ్డిని కోరారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఇప్పటికే రెండు వంతెనల నిర్మాణం చేపట్టామని మరో 5 వంతె నలు నిర్మించేందుకు వచ్చే వేసవిలో శంకుస్థాపన చేయనున్నట్లు ఆర్ అండ్ బి మంత్రి బి సి జనార్దన్ రెడ్డికి ఎమ్మెల్యే ఆనందరావు వివరించారు. శనివారం అమరావతిలో సెక్రటేట్‌లో మంత్రి జనార్దన్‌ను కలిసి పలు రోడ్ల నిర్మాణం అవసరం ఉంటుందని అందుకు పూర్తిగా సహకరించాలని కోరారు. తన పరిధిలో అవకాశం ఉన్నంత వరకు నిధులు మంజూరు చేస్తానని మంత్రి జనార్దన్ హామీ ఇచ్చారని ఆనందరావు తెలిపారు. వంతెనలు, రహదారులు వంటి పలు ప్రతిపాదనలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే ఆనందరావు మంత్రి జనార్దన్ రెడ్డికి అందజేశారు.

# మహేష్ ఫ్యాన్స్ ముందు మరో రుద్ర




మహేష్ బాబు 'బిజినెస్ మ్యాన్' రీ రిలీజ్ సందడి థియేటర్లలో ఓ రేంజ్‌లో నడిచింది. అయితే సినిమా మొదలయ్యే ముందు ప్రదర్శించిన ఒక స్పెషల్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. మహేష్ బాబు కెరీర్ షోరీల్‌గా ప్లే అయిన ఈ వీడియో చివర్లో కనిపించిన ఒక దృశ్యం చూసి ఫ్యాన్స్ ఆశ్చర్యపోయారు. తెరపై మహేష్ బాబు సాక్షాత్తు పరమశివుడి గెటప్‌లో కనిపించడమే ఇందుకు కారణం. అయితే ఇది నిజంగా రాబోయే సినిమాలోనిదా? లేక ఫ్యాన్స్ కోసం చేసిన గ్రాఫిక్స్ మ్యాజిక్కా? అనే దానిపై జోరుగా చర్చ మొదలైంది. ఆ వీడియోలో మొదట నందిపై స్వారీ చేస్తున్న శివుడిని చూపించారు. మరుక్షణమే ఆ శివుడి స్థానంలోకి మహేష్ బాబు ఎంట్రీ ఇచ్చారు. చేతిలో త్రిశూలం పట్టుకుని, నుదుటన విభూది ధరించి నందిపై వస్తున్న ఆ విజువల్ చూడగానే అది మొత్తం కూడా 'వారణాసి' సినిమా క్లిప్ ఏమో అని అందరూ భావించారు. ఆ గ్రాఫిక్స్ బ్లెండింగ్ అంత పర్ఫెక్ట్‌గా ఉండటంతో, కొంత సేపటి వరకు ఇది సినిమాలోనిదే అని ఫ్యాన్స్ ఫిక్స్ అయిపోయారు. ఇది సినిమాలోని సీన్ అని మేకర్స్ ఎక్కడా అధికారికంగా చెప్పలేదు. కేవలం షోరీల్ కోసం క్రియేట్ చేసిన గ్రాఫిక్స్ వీడియో. 'వారణాసి' టైటిల్ గ్లింప్స్ లోని షాట్స్ ను, శివుడి ఇమేజ్ తో మార్ఫింగ్ చేసి ఇలా డిజైన్ చేశారని అర్థమవుతుంది. కాబట్టి ఇది అఫీషియల్ లుక్ కాదని చెప్పవచ్చు. ఇక వారణాసి సినిమాలో మహేష్ బాబు శ్రీరాముడి గెటప్‌లో కనిపించనున్నట్లు ఇదివరకే క్లారిటీ ఇచ్చారు. రాజమౌళి స్వయంగా ఆ స్కెచ్ ను తన వాల్ పేపర్‌గా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇక రుద్ర పాత్రలో కనిపిస్తారని నందిపై వెళ్లిన షాట్‌ను కూడా టీజర్‌లో హైలెట్ చేశారు. ఇప్పుడు సడెన్‌గా ఇలా శివుడి రూపంలో కనిపించడంతో మరో రుద్రుడు కనిపించాడు అంటూ సోషల్ మీడియాలో గట్టిగానే హడావుడి చేస్తున్నారు. ఇది కేవలం షోరీల్ కోసం చేసినా, మహేష్‌ను ఆ గెటప్‌లో చూడటం ఫ్యాన్స్‌కు ఒక కొత్త కిక్ ఇచ్చింది. రాజమౌళి సినిమా అంటే సర్ప్రైజ్‌లు కామన్. కానీ అది సినిమాలోనిదా కాదా అనే క్లారిటీ రాకుండానే సంబరపడటం తొందరపాటే అవుతుంది. ఏఐలాంటి గ్రాఫిక్స్ వర్క్ అద్భుతంగా ఉండటంతో జనం దీన్ని రియల్ అని నమ్ముతున్నారు. వీడియో క్లిప్ ఇండస్ట్రీలో ఒక కొత్త బజ్ క్రియేట్ చేసింది. రాజమౌళి మదిలో ఏముందో ఎవరికీ తెలియదు. ఇంకా 'వారణాసి'లో మహేష్ పాత్ర ఎలా ఉండబోతోందో తెలియాలంటే అఫీషియల్ టీజర్ వచ్చే వరకు ఆగాల్సిందే. అప్పటివరకైతే ఈ ఫ్యాన్ మేడ్ థియరీలే సోషల్ మీడియాలో హల్చల్ చేస్తాయని చెప్పవచ్చు.

# తెలుగు స్టార్ డైరెక్టర్‌పై సల్మాన్ గురి..!



పాన్ ఇండియా సినిమాలతో మన తెలుగు స్టార్స్ చేస్తున్న బాక్సాఫీస్ బీభత్సాన్ని చూసి బాలీవుడ్ స్టార్స్ అంతా షాక్ అవుతున్నారు. బాలీవుడ్‌ని పూర్తిగా డామినేట్ చేసిన సౌత్ సినిమాలను చూసి బడా స్టార్స్ సైతం అవాక్కవుతున్నారు. అందుకే బీ టౌన్ స్టార్స్ కూడా సౌత్ డైరెక్టర్స్ తో పనిచేయాలని చూస్తున్నారు. ఆల్రెడీ కొందరు ఆ ప్రయత్నాలు చేసి సక్సెస్ అవగా మరికొందరు ఆ అటెంప్ట్ చేసేందుకు రెడీ అవుతున్నారు. ఆల్రెడీ సౌత్ డైరెక్టర్స్‌తో పనిచేసిన స్టార్స్ మళ్లీ మళ్లీ వారితోనే పనిచేయాలని చూస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం బాలీవుడ్ లో అసలేమాత్రం టైం కలిసి రాని కండల వీరుడు స్టార్ హీరో సల్మాన్ ఖాన్ మరో సౌత్ డైరెక్టర్‌తో పనిచేయబోతున్నాడు. అది కూడా తెలుగు దర్శకుడితో సల్మాన్ ఖాన్ సినిమా ఉంటుందని తెలుస్తుంది. మురుగదాస్‌తో సల్మాన్ ఖాన్ చేసిన సికిందర్ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఐతే ఈసారి గురి తప్పకూడదనే ఉద్దేశ్యంతో టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ వంశీ పైడిపల్లితో సల్మాన్ ఖాన్ సినిమా ప్లాన్ చేస్తున్నాడు. సల్మాన్ ఖాన్ వంశీ పైడిపల్లి సినిమాను ఎస్.వి.సీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లో దిల్ రాజు నిర్మిస్తారని తెలుస్తుంది. 18 ఏళ్ల కెరీర్ లో 6 సినిమాలు మాత్రమే చేసిన వంశీ పైడిపల్లి రెండేళ్ల క్రితం దళపతి విజయ్‌తో వారిసు సినిమా చేశాడు. ఐతే ఇప్పుడు సల్మాన్ ఖాన్‌తో సినిమాకు రెడీ అవుతున్నాడు. సల్మాన్ ఖాన్ కూడా సౌత్ డైరెక్టర్స్‌తో ముఖ్యంగా తెలుగు దర్శకుడితో పనిచేయాలని కొన్నాళ్లుగా ఆసక్తి చూపిస్తున్నారు. ఈ క్రమంలో తప్పకుండా సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి కాంబో సంథింగ్ స్పెషల్‌గా ఉండబోతుందని మాత్రం అర్థమవుతుంది. తెలుగులో స్టార్ డైరెక్టర్‌గా క్రేజ్ ఉన్న వంశీ పైడిపల్లి మూడు నాలుగేళ్లకు ఒక సినిమా చేసినా అది సంథింగ్ స్పెషల్‌గా ఉండేలా ప్లాన్ చేస్తారు. మహర్షి తర్వాత వారిసు కోసం గ్యాప్ తీసుకున్న వంశీ పైడిపల్లి సల్మాన్‌తో మరోసారి తన సత్తా చాటాలని చూస్తున్నారు. సల్మాన్ ఖాన్ కూడా ఈ ప్రాజెక్ట్ మీద చాలా హోప్స్‌తో ఉన్నారు. 2026 సెట్స్ మీదకు వెళ్లబోతున్న ఈ సినిమా మిగతా కాస్ట్ అండ్ క్రూ ఎవరన్నది త్వరలో తెలుస్తుంది. తెలుగు డైరెక్టర్ కాబట్టి సల్మాన్ ఖాన్ సినిమా తెలుగులో కూడా రిలీజ్ చేసేలా ప్లానింగ్ ఉందట. ఎలాగు నిర్మాత దిల్ రాజు కాబట్టి తెలుగు వెర్షన్ రెడీ చేయడం పెద్ద కష్టమేమి కాదు. తెలుగు స్టార్స్‌తో కూడా మంచి రిలేషన్ ఉన్న సల్మాన్ ఖాన్ టాలీవుడ్ డైరెక్టర్‌తో ఆయన చేస్తున్న ఈ ప్రయత్నానికి కోపరేషన్ దక్కుతుందని చెప్పొచ్చు.

# "భూత శుద్ధి పద్ధతి"లో సమంత రెండో పెళ్లి.. ప్రత్యేకత ఇదే!



ప్రముఖ స్టార్ హీరోయిన్ సమంత ఇన్ని రోజులు ప్రముఖ బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో రిలేషన్ లో ఉంది అంటూ వార్తలు రాగా.. వాటిని తాజాగా ఆమె కన్ఫామ్ చేసింది. ఈరోజు ఉదయం కోయంబత్తూర్‌లోని ఈషా యోగ సెంటర్ సమీపంలో ఉన్న లింగ భైరవి సన్నిధిలో డైరెక్టర్ రాజ్‌తో ఏడు అడుగులు వేసి ఈ విషయాన్ని అభిమానులతో పంచుకుంది. ముఖ్యంగా తమ పెళ్ళికి సంబంధించిన ఫోటోలను సమంత తన ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేస్తూ.. తన రెండో పెళ్లి విషయాన్ని అఫీషియల్ గా ప్రకటించింది సమంత. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నూతన జంటకు అభిమానులు, సినీ సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇకపోతే సమంత చేసుకుంది మామూలు పెళ్లి కాదు..ఇక్కడ కనివిని ఎరుగని రీతిలో "భూత శుద్ధి పద్ధతి"లో వివాహం చేసుకుంది అని తెలిసి అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఏంటి ఈ భూత శుద్ధి పద్ధతి.. ?ఎందుకు ఈ పద్ధతిలో సమంత వివాహం చేసుకుంది? అంటూ పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే సమంత భూత శుద్ధి పద్ధతిలో వివాహం చేసుకుంది అంటూ అందుకు సంబంధించిన విషయాలను తెలియజేస్తూ.. నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేసింది ఈశా ఫౌండేషన్. ఈ మేరకు లింగ భైరవి సన్నిధిలో వివాహం చేసుకోవడానికి గల కారణాన్ని.. అలాగే భూత శుద్ధి పద్ధతిలో ఎందుకు వివాహం చేసుకుంది అనే విషయాన్ని ఈశా ఫౌండేషన్ ఒక ప్రకటన ద్వారా తెలియజేసింది. అసలు ఈశా ఫౌండేషన్ విడుదల చేసిన ప్రకటనలో ఏముంది అనే విషయానికొస్తే.. "కోయంబత్తూర్‌లోని ఈశా యోగా కేంద్రం వద్ద ఉన్న లింగ భైరవి సన్నిధిలో సమంత - రాజ్ నిడిమూరు సోమవారం ఉదయం పవిత్రమైన భూత శుద్ధి వివాహం చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగిన ఈ వేడుకను అనాదిగా వస్తున్న యోగా సాంప్రదాయం ప్రకారం నిర్వహించడం విశేషం. ఆలోచనలు, భావోద్వేగాలు, భౌతికతకు అతీతంగా దంపతుల మధ్య లోతైన బంధాన్ని ఏర్పరచడానికి రూపొందించిన విశిష్టమైన పవిత్ర ప్రక్రియ ఈ భూత శుద్ధి వివాహం. ముఖ్యంగా ఈ వివాహ ప్రక్రియ వధూవరుల శరీరంలోని పంచభూతాలను శుద్ధి చేస్తుంది. వారి దాంపత్య ప్రయాణంలో శ్రేయస్సు, సామరస్యం, ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా.. ఆ దేవి అనుగ్రహాన్ని ప్రసాదిస్తుంది" అంటూ ఈశా ఫౌండేషన్ వారికి శుభాకాంక్షలు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేసింది.

# రిలీజ్‌కు ముందే మరో రెండు బ్లాస్ట్‌లా?




అఖండ 2 మరో నాలుగు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతున్న బాలయ్య తొలి పాన్ ఇండియా ప్రాజెక్ట్ ఇది. ఉత్తరాదిలో సినిమా మంచి వసూళ్లు సాధిస్తుందని అంచనాలున్నాయి. అందుకు తగ్గట్టే సినిమా నుంచి రిలీజ్ అయిన ప్రతీ ప్రచార చిత్రం అంతకంతకు మంచి హైప్ తీసుకొచ్చింది. ప్రాజెక్ట్ మొదలైన నాటి నుంచి ఇప్పటి వరకూ సినిమాపై ఎక్కడా హైప్ తగ్గలేదు. ప్రచార చిత్రాలు ..లిరికల్ సాంగ్స్ ప్రతీది ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. తాజాగా ఆ అంచనాలను రెట్టింపు చేసేలా ఇప్పుడు ఏకంగా జ్యూక్ బాక్స్‌ని రిలీజ్ చేసారు. సినిమాలో మొత్తం తొమ్మిది పాటలున్నాయి. కొంత కాలంగా ఆడియో రిలీజ్ ఈవెంట్లకు బధులు ప్రీ రిలీజ్ పేరుతో ఈవెంట్లు జరగడంతో? ఆడియో హైలైట్ అవ్వడం లేదు. అంతకు ముందే లిరికల్ సింగిల్స్ రిలీజ్ చేయడంతో బిగ్ సీడీలు లాంటివి కనిపించలేదు. మారిన ట్రెండ్‌కు అనుగుణంగా ప్రచారం జరుగుతోంది. తాజాగా అఖండ2 కంప్లీట్ జ్యూక్ బాక్స్‌ను మార్కెట్లో అందుబాటులోకి వచ్చేసింది. ఇప్పటికే థాండవం, జాజీకాయ పాటలు రిలీజ్ అయ్యాయి. వాటికి శ్రోతల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రీమియర్‌కి ముందుగా జూక్‌బాక్స్ నుండి ఒకటి లేదా రెండు ట్రాక్స్‌లను లిరికల్ వీడియోలుగా విడుదల చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. సినిమా రిలీజ్‌కు ముందు రిలీజ్ అయితే అవి మ్యూజిక్ ప్రియులకు కనెక్ట్ అయితే రిలీజ్ తర్వాత కలిసొస్తుందన్నది మేకర్స్ ప్లాన్ కావొచ్చు. ఈసినిమాకి పాటలు రచించిన వారు..వాటిని ఆలపించిన వారు వీరే.. కల్యాణ్ చక్రవర్తి రచించిన అఖండ తాండవం పాటను సర్వేపల్లి సిస్టర్స్ ఆలపించారు. ఇంకా అధ్వితీయ వొజ్జల రచించిన గంగాధర శంకర పాటను ఎస్. ఐశ్వర్య, ఎస్. సౌందర్య, శృతి రంజని పాడారు. శివ శివ పాటను కల్యాణ్ చక్రవర్తి రచించగా గొట్టే కణకవ్వ, శృతి రంజని ఆలపించారు. శంభో పాటను ఆద్వితీయ వొజ్జల రచించగా, ఎస్. ఐశ్వర్య, ఎస్. సౌందర్యతో పాటు వొజ్జల పాడారు.అఖండ హిందువం పాటను నాగ గురునాథశర్మ రంచిచగా, సర్వేపల్లి సిస్టర్స్ పాడారు. హే తాండవం పాటను శంకర్ మహాదేవన్, కైలాస్ ఖేర్, దీపక్ బ్లూ ఆలపించగా, జాజికయ పాటను కాసర్య శ్యాం రచించగా బ్రిజేష్ సందిల్య, శ్రేయా ఘోషాల్ పాడారు.

# సీపీఎం నాయకులు జొన్నలగడ్డ వెంకంరాజుని పరామర్శించిన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి





**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు జొన్నలగడ్డ వెంకంరాజు సతీమణి జొన్నలగడ్డ నర్మదా ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో శనివారం బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ పరిధిలోని వారి స్వగృహానికి వెళ్లి స్వర్గీయ నర్మదా చిత్రపటానికి మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు బొతంశెట్టి శ్రీనివాసులు, గండవరపు శ్రీనివాసులు, వైసీపీ మండల పార్టీ కన్వీనర్లు, కౌన్సిలర్లు మరియు వైసీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# నవజీవన్ ఆర్గనైజేషన్ -సి.సి- పి.యు- ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ






**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** నవజీవన్ ఆర్గనైజేషన్ – సి.సి. పి.యు ప్రాజెక్టు ఆధ్వర్యంలో క్రొవ్వొత్తుల ర్యాలీ మరియు ఐ.ఇ.సి కరపత్రాల పంపిణీ ద్వారా హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ పై అవగాహన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశముల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగం సహకారంతో నవజీవన్ ఆర్గనైజేషన్ – సి.సి– పి.యు– ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని "క్రొవ్వొత్తుల ర్యాలీ మరియు ఐ.ఇ.సి కరపత్రాల పంపిణీ ద్వారా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహనను నాయుడుపేట సూళ్లూరుపేట, వెంకటగిరి మరియు దొరవారి సత్రంలోని ఏరియాలలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో భాగంగా ప్రాజెక్టు మేనేజర్ కె. బాలాజి మాట్లాడుతూ ఈ క్రొవ్వొత్తుల ర్యాలీ మరియు ఐ.ఇ.సి కరపత్రాల పంపిణీ చేయడం ద్వారా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, సుఖ వ్యాధులు మరియు చికిత్స గూర్చి, ఎ.ఆర్.టి మందులు గూర్చి తెలియజేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ సి.సి పి.యు సిబ్బంది అయిన కవిత, మంజుల, నందిని, శ్రావణి, సాయి లక్ష్మి, ఐశ్వర్య, ముని కూమారి, శ్రీలత, పి.ఇలు మరియు ఇతర మహిళలు పాల్గొని ప్రజలకు హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహనను కల్గించడం జరిగింది అని తెలియజేశారు.

# విద్యార్థినుల భద్రతకు 'శక్తి' యాప్

## - బస్సును ఆపి అవగాహన కల్పించిన సంగం సీఐ వేమారెడ్డి

**సంగం, (రాజధాని వార్తలు):** మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం ప్రభుత్వం రూపొందించిన 'శక్తి' మొబైల్ యాప్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, తప్పనిసరిగా తమ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి పిలుపునిచ్చారు. సంగం పరిధిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రయాణిస్తున్న బస్సును సీఐ వేమారెడ్డి మార్గమధ్యంలో ఆపారు. బస్సులోని విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రత్యేకంగా శక్తి యాప్ గురించి సమగ్రంగా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 'శక్తి' యాప్‌లోని ఎస్ఓఎస్ (ఎస్ ఓ ఎస్) బటన్‌ను నొక్కితే వెంటనే ఆ సమాచారం సమీపంలోని పోలీసు కంట్రోల్ రూమ్‌కు చేరుతుందని, తద్వారా పోలీసులు నిమిషాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరుకుని సహాయం అందించగలుగుతారని సీఐ తెలిపారు. విద్యార్థినులు, మహిళలు ఆపదలో ఉన్నప్పుడు



భయపడాల్సిన అవసరం లేదని, రక్షణ కోసం ఈ యాప్‌ను ఒక సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు. మహిళా భద్రతకు కవచంలాంటి ఈ యాప్‌ను కళాశాల విద్యార్థినులందరూ వారి మొబైల్ ఫోన్లలో వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

# మాస్టర్ ఓరేటర్ కాంటెస్ట్ ప్రోగ్రాంలో గోమతి నారాయణ విద్యార్థుల ప్రతిభ

## - విద్యార్థులను అభినందించిన వేమిరెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో రెండు రోజులపాటు ఉత్సాహంగా సాగిన మాస్టర్ ఒరేటర్ కాంటెస్ట్ సాఫ్ట్ స్కిల్స్ సీజన్ 6 గ్రాండ్ ఫినాలేలో, నారాయణ గోమతి సీబీఎస్ఈ స్కూల్కు చెందిన విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి సత్తా చాటారు. విద్యార్థులు ఓరేటర్ వేదికపై ఆత్మవిశ్వాసం, స్పష్టమైన ప్రెజెంటేషన్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, తమ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ఒరేటరీ స్కిల్స్‌తో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, న్యాయ నిర్ణేతలు విద్యార్థుల ప్రతిభను ప్రశంసించి అభినందించారు. స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ తమ పాఠశాలలో చదివే విద్యార్థులు గ్రాండ్ ఫినాలే లో విజయం సాధించడం ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. మరిన్ని విజయాలు సాధించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహద పడతాయని పేర్కొన్నారు. గ్రాండ్ ఫినాలే విజేతల జాబితా గ్రేడ్ 1లో మోహిత్ గ్రేడ్ 2 లో అద్విక, గ్రేడ్ 3లో మీరజ్ అమాన్ గ్రేడ్ 4 – బి2 క్యాటగిరిలో లినీషా కొలస్టిక్, జినిషా, జిషిత రెడ్డి, హిబ్బ, జోషిత, శ్రీ మహిమ, కార్తిక నిత్య తదితరులు వివిధ విభాగాలలో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా నారాయణ గ్రూప్ జనరల్ మేనేజర్ శ్రీ వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి విజేతలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

# వృద్ధాశ్రమాలు లేని సమాజం రావాలి : డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి



**కాకినాడ, (రాజధాని వార్తలు):** వృద్ధాశ్రమాలు లేని సమాజం ఉండాలన్నదే తన ఆశయమని దీని ద్వారా కుటుంబ వ్యవస్థ పదిలంగా ఉండే అవకాశం ఉంటుందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై కళ్యాణ్ చక్రవర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధికారిక పర్యటనలో భాగంగా శుక్రవారం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న పర్మినెంట్ ప్రాజెక్టులను క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో ఆయా ప్రాజెక్టుల చైర్మన్లు రోటరీ గవర్నర్ కళ్యాణ్ చక్రవర్తికి చూపించి వాటి సేవా కార్యక్రమాలను వివరించారు. తొలుత అచ్చంపేట గ్రామంలో నిర్వహిస్తున్న రక్షత మంచినీటి ప్రాజెక్టును చైర్మన్ చెలికాని సూర్యారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తికి స్వాగతం పలికి గత దశాబ్ద కాలంగా రక్షత మంచినీటి సరఫరా విషయంలో అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలుపుకున్నారు. చెలికాని సూర్యారావు మాట్లాడుతూ ఆనాడు ఈ ప్రాంతంలో తొలిసారిగా రక్షత నీటి ప్రాజెక్టును ప్రారంభించిన ఘనత రోటరీ గోల్డెన్ జూబ్లీకే దక్కుతుందని దీని ద్వారా అదే తక్కువ ధరకే రక్షిత మంచినీటిని ప్రజలకు సరఫరా చేస్తూ ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యతమిస్తున్నామని గుర్తు చేశారు. ప్రజలకు ఎంతో ఉపయోగపడే విధంగా ఈ ప్రాజెక్టును విజయవంతంగా గ్రామ ప్రజల సహకారంతో నిర్వహిస్తున్నామని సూర్యారావు వివరించారు. అనంతరం రోటరీ వృద్ధాశ్రమాన్ని సందర్శించినప్పుడు కమిటీ చైర్మన్ డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమ కమిటీ సభ్యులతో పాటు నివాసముంటున్న మహిళలందరూ రోటరీ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తికి అపూర్వ ఆప్యాయత స్వాగతాన్ని పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిని ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ ఎస్ వి ఎస్ రావు చేతుల మీదుగా కమిటీ చైర్మన్ డాక్టర్ సతీష్ కోశాధికారి భూపేంద్ర లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రోటరీ వృద్ధాశ్రమ వ్యవస్థాపకురాలు క్లబ్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి 80 సంవత్సరాల విజయ యాత్ర అనే అపూర్వ గ్రంథాన్ని డాక్టర్ వై కళ్యాణ్ చక్రవర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభ్యులు ఉద్దేశించి డా కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులతో కలిసి జీవనం సాగించడమే హైందవ ధర్మానికి ప్రతి కని నేడు కొన్ని కారణాల దృష్ట్యా వృద్ధాశ్రమాలలో వారి పేరెంట్స్ ఉంచుతున్నారని చెప్పారు. నేటి తరానికి వృద్ధుల యొక్క విలువ, వారి జ్ఞానం, వారి అనుభవం తెలుసుకోవడానికి వీలు లేకుండా పోతుందని కళ్యాణ్ చక్రవర్తి ఆవేదన వ్యక్తం చేశారు. రోటరీ వృద్ధాశ్రమంలో నివాసముంటున్న మహిళలందరూ గృహ వాతావరణంలాగా మరియు అన్ని సౌకర్యాలు కల్పించడమే కాక వైద్య సేవలను కూడా సకాలంలో అందిస్తూ తమ ఇంటి వ్యక్తులుగా చూసుకుంటున్నారని ఎంతో ఆనందంగా చెప్పడం రోటరీ సభ్యులలో ఉన్న అంకిత భావాన్ని వ్యక్తమవుతుందని డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, కార్యదర్శి సానా ప్రవీణ్, కోశాధికారి ఉదయ చక్రవర్తి, అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి, పి డి జి డాక్టర్ ఎస్ వి ఎస్ రావు, ప్రెసిడెంట్ ఎలెక్ట్ తాళ్లూరి శ్రీనివాస రాజు, డాక్టర్ నయన శ్రీరామ్ రావుల, నల్లమిల్లి మాచారెడ్డి, చిరంజీవి రెడ్డి, టేకుమూడి సూర్యనారాయణ, మాజేటి పవన్, లంక సాయిబాబు, డాక్టర్ మొండి రవికుమార్, నరహరిశెట్టి రవి కృష్ణ, సత్తి వెంకటరెడ్డి, చందు, బల్ల సత్యపాల్, డాక్టర్ పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.


# మహాత్మా జ్యోతిరావు పూలే 135 వ వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల నివాళి

## - పూలే స్ఫూర్తితో అందరికీ విద్య, సామాజిక న్యాయం సాధించాలి



**కాకినాడ, (రాజధాని వార్తలు):** మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తితో అందరికీ విద్య, సామాజిక న్యాయం సాధించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్‌లో పూలే విగ్రహానికి అంబేద్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు, జిజిహెచ్ ఎదురుగా ఉన్న విగ్రహానికి పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామేశ్వరరావు, సత్తిరాజు లతో పాటు సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జీ, మాజీ జెడ్.పి.టి.సి సభ్యులు నులుకుర్తి వెంకటే శ్వరరావు, సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు తదితరులు మాట్లాడుతూ బడుగుల జీవితాల్లో అక్షర వెలుగులు నింపిన జ్యోతి మహాత్మా పూలే అని కొనియాడారు. కుల వివక్షత, అంటరాని తనంపై పోరాడిన పూలే దేశంలో తొలి సామాజిక విప్లవకారు డన్నారు. తన భార్య సావిత్రిబాయికి చదువు నేర్పి తన ద్వారా బాలికల విద్యావ్యాప్తికి విశేషమైన కృషి చేశారన్నారు. 1874లో సత్యశోధక్ సమాజ్ స్థాపించి, యువతను అభ్యుదయ మార్గంలో నడిపించారన్నారు. 1882లో హంటర్ కమిషన్‌కు విద్య, రిజర్వేషన్‌లు గురించి పూలే వినతి పత్రం సమర్పించారన్నారు. ప్రపంచ మేధావిగా పేరు గాంచిన అంబేద్కరే పూలేను తన గురువుగా భావించారన్నారు. పూలే స్ఫూర్తితో అందిరికీ విద్య, సామాజిక న్యాయం సాధనకై నేటి తరం ఉద్యమం సాగించాల న్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ, కెవిపిఎస్ నాయకులు జి.సత్యానందం, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు చంద్ర మళ్ళ పద్మ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టేకుమూడి ఈశ్వరరావు ఎస్ఎఫ్ఐ కార్యకర్త డి.ఆదర్శ్‌లతో పాటు టి.రాణి, డి.శారద, వెంకట్రావు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో చట్టంపై అవగాహన సదస్సు





**కాకినాడ, (రాజధాని వార్తలు):** జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి సిహెచ్.లక్ష్మి ఆదేశాలు మేరకు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఆధ్వర్యంలో స్థానిక పి ఆర్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ వి రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో ముఖ్య అతిథిగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ పోక్సో చట్టం అనేది లైంగిక నేరాల నుండి పిల్లలకు రక్షించడానికి భారత ప్రభుత్వం రూపొందించిన చట్టం అని తెలిపారు. ఈ చట్టం 18 సంవత్సరాలు లోపు పిల్లలందరిని లైంగిక వేధింపులు, లైంగిక దాడి మరియు లైంగిక దోపిడీ నుండి రక్షిస్తుందన్నారు. బాలలపై లైంగిక వేధింపులు, లైంగిక దాడి, అశ్లీలత వంటి తీవ్రమైన నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఈ చట్టాన్ని తీసుకు వచ్చారన్నారు. లైంగిక నేరాలను బట్టి ఈ చట్టం కింద కఠిన శిక్షలు ఉంటాయన్నారు. తీవ్ర మైన లైంగిక దాడి కేసులో దోషికి కనీసం 10 సంవత్సరాలు నుండి 20 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు మరియు జీవిత ఖైదు వరకు శిక్ష విధించవచ్చునని విద్యార్థులకు తెలియజేసారు. అంతేకాకుండా విద్యార్థులు ఆకతాయిల మాటలకు, ప్రలోభాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా ప్రేమ పేరుతో వేధించిన, బహుమతులు ఇచ్చిన తీసుకోరాదని ముఖ్యంగా ఆడపిల్లలు భద్రత వారు చేతుల్లోనే ఉందని తమను తాము రక్షించుకోవలసిన బాధ్యత కూడా వారిపై ఉందని అన్నారు. బాలలపై లైంగిక వేధింపులకు గురి చేసే వారిలో అత్యధికముగా బాలలతో పరిచయం ఉండి, వారికి నమ్మకమైన వ్యక్తి లేదా వారిపైన అధికారం చలయించగలిగే స్థానంలో ఉన్న వ్యక్తి మరియు వ్యక్తుల ద్వారానే బాలలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయన్నారు. సురక్షిత స్పర్శ మరియు అసురక్షిత స్పర్శ గురించి తెలియజేసారు. ఎవరైనా ముట్టు కోవడానికి ప్రయత్నిస్తే డోంట్ టచ్ (ముట్టు కోవద్దు) అని లేదా గట్టిగా కేకలు వేయమని, జన సమూహం ఉన్న ప్రదేశానికి పారిపోమని చెప్పారు. ఎవరైనా ప్రేమ పేరుతో వేధించిన లేదా లైంగిక వేధింపులకు గురిచేసిన, ప్రలోబాలకు పాల్పడిన, బాల్య వివాహాలు చేస్తున్నట్లు సమాచారం ఉన్న వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా పోలీస్ 112 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. చెప్పిన వారు వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

అదేవిదంగా బాల్యవివాహలకు వ్యతిరేకంగా మరియు హింసకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ తీసుకున్నారు. ఈ కార్యక్రమములో పి ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు చట్టాలు వాటి ప్రాము ఖ్యత తప్పక తెలుసుకోవాలన్నారు. ఆడపిల్లలు జాగ్రత్తలను పాటిస్తూ మిమల్ని మీరు రక్షించు కోవాలన్నారు. ప్రతీ ఒక్కరికి ఒక లక్ష్యం ఉండాలని ఆలక్ష్యంవైపు కృషి చేయాలి కానీ వ్యామో హాల వైపు కాదని అన్నారు. ఎవరైనా ఆకతాయిలు ప్రేమ పేరుతో వెంబడించిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి ఫోన్ చేసి సమాచారము ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమములో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేసు వర్కర్ యన్ వి లక్ష్మి, కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అమృత 2.0 పనులు వెంటనే మొదలు పెట్టాలి : 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంజూరు చేయించిన అమృత 2.0 పథకాన్ని వెంటనే వెంకటగిరి ప్రజలను దృష్టిలో ఉంచుకొని పనులు మొదలుపెట్టాలని 14వ వార్డు కౌన్సిలర్, వెంకటగిరి నియోజకవర్గ ఆర్టిఐ విభాగపు అధ్యక్షుడు ఆరి శంకరయ్య విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటగిరి మునిసిపాలిటీ చైర్ పర్సన్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. వెంకటగిరి మునిసిపాలిటి ఎటువంటి ఫ్యాక్టరీలు లేవు, మునిసిపాలిటీకి ఆదాయం కేవలం ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, ఖాళీ స్థల పన్నులు మాత్రమే వస్తుందని తెలిపారు. వెంకటగిరిలో సుమారు 30 ప్రైవేటు లేఅవుట్‌లు ఉన్నాయి. వాటిలో మొత్తం 3791 ప్లాట్లు కలవు, వాటికి విఎల్‌టి పన్ను వేస్తే 1సం. ప్లాట్‌కి సుమారు 2000/-రూ. చొప్పున 12 నెలలకి 75,82,000/-రూ ఆదాయం మునిసిపాలిటి కి వస్తుంది తెలిపారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ ఆర్.ఓ కలిసి పన్ను లేని ప్లాట్లను గుర్తించి, జాయింట్ సర్వే చేసి వాటికీ పన్ను విధిస్తే మునిసిపాలిటీకి ఆదాయం పెరుగుతుంది అని తెలిపారు. ఆర్ & బి అధికారులు మునిసిపాలిటీ అధికారులు కలసి వెంకటగిరిలో మునిసిపాలిటీ రోడ్డులు, ఆర్ & బి రోడ్డులు సర్వే చేసి ఆక్రమణలను గుర్తించి, ఆక్రమణదారులు గుర్తించి వారి దగ్గర నుండి అద్దెలు వసూలు చేస్తే వారి దగ్గర నుండి 1 నెలకు సుమారు 30 లక్షల రూపాయలు ఆదాయం వస్తుంది అని అన్నారు. గవర్నమెంట్ లేఅవుట్‌లలో మరియు ప్రైవేట్ లే అవుట్‌లలో పి.పి స్థలాలను గుర్తించి వాటిలో ప్రభుత్వం బోర్డులు ఏర్పాటు చేయాలి, ప్రజల కనీస అవసరాలు నీరు, కరెంటు, పారిశుద్యం. గత వై.ఎస్.ఆర్.సి.పి ప్రభుత్వంలో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డికి వెంకటగిరి నీటి అవసరాలగురించి తెలిపి అమృత్ 2.0 – Tranche-1 పథకం ద్వారా 92 కోట్ల రూ. మరియు అమృత్ 2.0 Tranch-2 ద్వారా 11 కోట్ల రూ. మంజూరు చేయించారు. వెంటనే వాటికీ సంబందించిన పనులు మొదలు పెట్టాలి. అమృత్ 2.0 కి సంబందించిన ఫండ్స్ అలాకేషన్ కాపీ, కాన్సిల్ తీర్మానం, కాపీ నకలు జత చేయడమైనది. వెంకటగిరిని అభివృద్ధిలో నడిపించాలని ఆయన తెలియజేశారు.

# టిడ్కో గృహ లబ్ధిదారులకు రుణ మేళా: “మెప్మా పి.డి ఎఫ్రాఈము.జాలా”





**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** నాయుడుపేట పట్టణ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయంలో నిర్మించిన గృహాలకు” ఈజీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్” కంపెనీ ద్వారా రుణ సదుపాయం ఏర్పాటు చేసినట్లు తిరుపతి జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎఫ్రాఈము.జాల వెల్లడించారు. శనివారం ఆయన నాయుడుపేట పట్టణ పరిధిలోని అంబేద్కర్ భవనంలో లబ్ధిదారుల డాక్యుమెంట్స్ పరిశీలనతోపాటు, ఫైనాన్స్ కంపెనీ ద్వారా ఇంటి పై రుణ మేళా ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఎంపిక చేసుకున్న గృహ సముదాయాలను బట్టి రుణాలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 430 చదరపు అడుగుల విస్తీర్ణం గల డబల్ బెడ్ రూమ్ నిర్మాణానికి 3 లక్షల 65 వేలు, 365 చదరపు అడుగుల నిర్మాణానికి 3.15 వేలు రుణం మంజూరు చేయడం జరిగిందన్నారు. 500 రూపాయలు కట్టిన లబ్ధిదారులకు మాత్రం ఉచిత గృహం కేటాయించడం జరుగుతుందని వివరించారు. నాయుడుపేట పట్టణ పరిధిలో నిర్మించిన టిట్కో గృహాలు 2064 గృహ సముదాయాలు. రానున్న సంక్రాంతి పండుగ నాటికి లబ్ధిదారులకు అప్పగించే ప్రక్రియ ప్రభుత్వం చేపట్టిందని తెలియజేశారు. రుణం తీసుకున్న లబ్ధిదా రులకు రెండు దశల్లో 12.4%, 11% వడ్డీతో ఈఎంఐ విధా నంలో చెల్లించాలని అన్నారు. లబ్ధిదారులకు ఏవైనా అనుమానాలు ఉంటే నాయుడుపేట మున్సిపల్ కమిషనర్‌ని కలిసి అను మానాలు నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. ఏ కార్యక్రమంలో వందలాది మంది లబ్ధిదారులు రుణమేళా కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట కమిషనర్ ఫజులుల్లా,డిస్టిక్ కో-ఆర్డినేటర్ ముషీర్ అహ్మద్, మెప్మా ఐ వి స్పెషలిస్ట్ రమణ, సీఎం ఎన్ సురేంద్ర నాయుడుపేట పట్టణ మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# రూ. 81,600 మిగులు బడ్జెట్ ఆమోదం

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండల బడ్జెట్ అంచనాలపై ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదం పొందింది. అలాగే మండల పరిధిలో అన్నదాత సుఖీభవ నిధులు విషయంలో రైతులకు పూర్తిస్థాయిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్నట్లుగా జమ కావడం లేదని ప్రకటన ఉన్నట్టుగా అమల్లోకి రావడం లేదని సామర్లకోట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సత్తిబాబు అధ్యక్షతన ఎంపీడీవో కాదా హిమామహేశ్వరి ఆధ్వర్యంలో మండల పరిషత్ బడ్జెట్ సమావేశము, పలు శాఖల పనితీరుపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మండల తహసిల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి ప్రసంగిస్తుండగా ఎంపీపీ సత్తిబాబు మాట్లాడుతూ సామర్లకోట మండలంలో ఎంతమంది అర్హులు ఉన్నారని అన్నదాత సుఖీభవ నిధులు ఎంతమందికి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. మండల మండల వ్యవసాయ అధికారి వంగపండు మురళీధర్ మాట్లాడుతూ మండల పరిధిలో మొత్తం 14,000 మంది రైతులు ఉండగా 7012 మందికి అన్నదాత సుఖీభవ నిధులు జమ అయినట్లు చెప్పారు. ఒకే కుటుంబంలో నలుగురు ఐదుగురు రైతులు ఉన్నప్పటికీ ఒక రైతుకే నిధులు జమ అవుతాయని ఏవో వివరించారు. పలు కారణాలతో నిధులు జమ కాని వారికి త్వరలో ప్రత్యేక ఆన్లైన్ ద్వారా నమోదు చేపట్టి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి వివరించారు. కొంతసేపు ఈ పథకంపై ఆసక్తికర చర్చ సాగింది. అలాగే తుఫాన్ పంట నష్టం నమోదు ఎంత చేపట్టారు వివరించాలని ఎంపీపీ ప్రశ్నించగా మండల పరిధిలో 8,000 మంది రైతులకుఎకరాకు పదివేలు చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసిందని త్వరలోనే రైతులు ఖాతాలకు జమవుతాయని వ్యవసాయ అధికారి మురళీధర్ చెప్పారు. రవి సీజన్లో ఎరువులు కొరత లేకుండా ముందేస్తు చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారికి ఎంపీపీ సూచించారు. మండల పరిధిలో



ప్రభుత్వ పాఠశాలలో ఎన్ని ఆర్వో వాటర్ ప్లాంట్‌లు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి ఎన్ని రిపేర్లు ఉన్నాయి గుర్తించి సమాచారం ఇవ్వాలని, వారానికి ఒకసారి జాయింట్ తనిఖీలు చేపట్టేలా తనకు షెడ్యూల్ ఇవ్వాలని ఎంఈఓ2 పి పుల్లయ్యను ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు కోరారు. గ్రామాల్లో ప్రస్తుత సీజన్‌లో వైరల్ ఫీవర్, డెంగ్యూ మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు పెరగడంతో, సామాన్య ప్రజలు వేలాది రూపాయలు ఖర్చు చేసి వైద్యం పొందలేక అప్పుల పాలవుతున్నారని ఎంపీటీసీ శివకోటి శివరామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాధులకు ప్రబలకుండా గ్రామాల్లో దోమల మందు పాగింగ్ ప్రజలకు అవగాహన చేపట్టాలని కోరారు. గతంలో మంజూరు చేసి ఇచ్చిన జగనన్న ఇళ్ల స్థల పట్టాల పరిస్థితి ఏమిటో అధికారులు ఎప్పటికీ తేల్చడం లేదని ఆయన ప్రశ్నించారు.

**చర్చ లేకుండా బడ్జెట్ ఆమోదం**

కాగా తొలుత 2025 – 26 సవరణలు బడ్జెట్, 2026 27 అంచనాల మిగులు బడ్జెట్ రూపాయలు 81,600తో సమావేశంలో చర్చించకుండా ఆమోదించారు. ఒక సమావేశంలో ట్రాన్స్కో రూరల్ ఇంజనీర్ నాగేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుభాషిని, తహసిల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీ డీవో హిమామహేశ్వరి, వేట్లపాలెం పిహెచ్సి వైద్యా ధికారి డాక్టర్ ఫార్దేష్ మాట్లాడారు. సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# తమ్మవరంలో “రైతన్న మీకోసం” రైతు సంక్షేమ పథకాలపై కూటమి నాయకులు విస్తృత ప్రచారం





**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ తమ్మవరం గ్రామంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ చొరవతో కూటమి నాయకులు, బీజేపీ నాయకులు గ్రామంలోని రైతుల ఇళ్లను సందర్శించి, కేంద్ర-రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రాంకుమార్ మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా రైతులకు మొత్తం రూ.20 వేలలో 14 వేల రూపాయలు ఇప్పటికే ఖాతాల్లో జమయ్యాయని వెల్లడించారు. రైతులు ధాన్యం అమ్మిన 24 గంటల్లోపే చెల్లింపు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతు భారం తగ్గించేందుకు కేంద్రం 90 శాతం సబ్సిడీతో డ్రోన్ స్ప్రేయర్లను అందించగా, తన చొరవతో నియోజకవర్గంలో ఐదు డ్రోన్ స్ప్రేయర్లు పంపిణీ చేసి రైతుల వ్యయాన్ని తగ్గించడంతో పాటు ఆర్థిక భరోసా కల్పించినట్లు తెలి పారు. అలాగే బస్తాకు రూ.1400 నుండి రూ.2200 వరకు ఎరువుల సబ్సిడీ కూడా కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని వివరించారు.

రైతు సేవ కేంద్రాల ద్వారా ఈ పథకాలన్నీ రైతులకు మరింత సులభంగా చేరేలా కూటమి ప్రభుత్వాలు కృషి చేస్తున్నా యని, స్థానికంగా అందుబాటులో ఉన్న సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని రైతు లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, కిసాన్ మోర్చా నాయకులు బొలిశెట్టి వెంకట రామకృష్ణ, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, త్రిమూర్తులు, మండల అధ్యక్షుడు నందూరి సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి పాలిక శివ గంగబాబు, మంగరాజు, జనసేన గ్రామ అధ్యక్షులు, అగ్రికల్చర్ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశాలకు వేతనాలు పెంచే వరకు పోరాటాలు

## - 6వ కాకినాడ జిల్లా మహాసభలో గౌరవ అధ్యక్షురాలు బేబీరాణి పిలుపు

## - రాసిచ్చిన హామీల మేరకు ఆదేశాలు విడుదల చేయాలని డిమాండ్

**కాకినాడ, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ కాకినాడ జిల్లా 6వ మహాసభలు కచేరిపేట సుందరయ్య భవన్ నందు సీనియర్ కామ్రేడ్ మేరీ నిర్మల అనంత కుమారి జెండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. ఈ మహాసభను ఉద్దేశిస్తూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.బేబీరాణి, ఆశా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ళ పద్మ, సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జి మాట్లాడుతూ గత ఆరేళ్ల నుండి ఆశా వర్కర్స్‌కి వేతనాలు ప్రభుత్వాలు పెంచలేదని, కానీ నిత్యవసర సరుకుల ధరలు మాత్రం అనేకరెట్లు పెరిగాయని, తక్షణం ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ వర్క్‌ల పేరుతో ఆశాలపై వేధింపులు ఆపాలని, ఎన్నికల ముందు చేసిన పోరాటం ఫలితంగా రాసి ఇచ్చిన హామీల మేరకు తక్షణం ఆదేశాలు విడుదల చేయాలని కోరారు. ఆశా కార్యకర్తలకు గ్రాడ్యుటీ చెల్లించాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని, ఆశాలు ప్రభుత్వ ఉద్యోగులనే పేరుతో కుటుంబంలోని సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెల ఆశాల సమస్యలపై డిఎం హెచ్ఓ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించాలని, పై డిమాండ్ల సాధన కోసం అలుపెరుగని పోరాటా లకు ఆశాలు సిద్ధపడలాని పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు 68 పిహెచ్సిల నుండి నాయకులు హాజరయ్యారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్




హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రవతి సౌహార్ద సందేశం ఇచ్చారు. ఆనంతరం జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా జి.బేబీ రాణి, అధ్యక్షురాలిగా రాయుడు.నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా చంద్రమళ్ల పద్మ, కోశాధికారిగా నొక్కు లలిత, ఆఫీస్ బేరర్స్‌గా ఎం.లక్ష్మీ, ఎం.భారతీ ప్రియ, ఎన్.ఉమాదేవి, ఎం.ఆశాజ్యోతి, మలకా నాగలక్ష్మి, చెక్కల వేణి, ఎల్.దుర్గాదేవి, వర్కింగ్ కమిటీ సభ్యులుగా అంకాడి పద్మావతి, వెంకటలక్ష్మి, సత్యవేణి, వెంకటలక్ష్మి, వీరలక్ష్మి, పిఠాపురం వెంకటలక్ష్మి, మంగా రత్నం, హేప్రిగ్రెస్, ఆనంతలక్ష్మి, సత్యవతి, వరలక్ష్మి, శాంతి, చిలకమ్మ, రమణమ్మ, గంగాభవాని, నుకరత్నం, సత్యవతి, కన్నయమ్మ, మరియా రత్నం, భవాని, అరుణ 21 మందితో ఏకగ్రీవంగా ఏర్పడిందన్నారు.

# ఘనంగా న్యూహోప్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవ వేడుకలు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖలో న్యూహోప్ ఫౌండేషన్ పదవ వార్షికోత్స వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు కళా, సాహితీ, జర్నలిజం, సేవారంగాల్లో విశేష సేవలు అందించిన వారిని ఫౌండేషన్ వ్యవస్థాపకరాలు డాక్టర్ ఎం నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షులు కె కె రాజు, ప్రముఖ వైద్యులు కోటేశ్వర ప్రసాద్, బీసీ జేఏసీ నార్త్ ఆంధ్ర కో-ఆర్డినేటర్ నరేంద్ర యాదవ్, సురేంద్రనాద్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్బంగా అతిధులు మాట్లాడుతూ ప్రతి ఏటా న్యూహోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురుని గుర్తించి వారిని సత్కరించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో ఈ ఫౌండేషన్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నాగమల్లేశ్వరి మాట్లాడుతూ సమాజంలో ఉన్నతంగా జీవించే హిజ్రాలను ఈ 10వ వార్షికోత్స వేడుకల్లో సత్కరించి వారికి సహకారం అందించాలని భావించామని అందరి సహకారంతోనే ఇటువంటి కార్యక్రమాలు ప్రతి ఏటా చేయడం ఆనందంగా ఉందన్నారు. పారిశుద్ధ్య కార్మికులు, వైద్యులు, జర్నలిస్టులు ఇలా వంద మంది వరకూ సేవాపరులను గుర్తించి వారిని సత్కరించామన్నారు. దానికి మంచి మనసులో హిజ్రాలు అంగీకరించడం కూడా ఆనందంగా ఉందన్నారు. విశాఖలాంటి మహా నగరంలో డ్రగ్స్ వినియోగంతో యువత చాలా పెడత్రోవ పడుతున్నారని వాటి నియంత్రణలో అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని సూచించారు. అదేవిధంగా స్కూలు, కాలేజీలకు వెళ్లే ఆడపిల్లలను ఇష్టానుసారం తాకే వారి విషయంలో వారికి అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా ఆడపిల్లలు ఎవరి విషయంలోనైనా ఫిర్యాదులు చేస్తే వాటిని తల్లిదండ్రులు తక్షణమే పరిగణలోకి తీసుకొని వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. తదుపరి హిజ్రాలను అతిథులు ఘనంగా



దుస్సాలువాలతో సత్కరించారు. అనంతరం హిజ్రాలు మాట్లాడుతూ సమాజంలో హిజ్రాలంటే చిన్న చూపు ఉందని దానిని నియంత్రించడానికే తాము కూడా గౌరవప్రదంగా జీవితాలను చక్కదిద్దుకుంటున్నామన్నారు. ఎవరో కొందరు హిజ్రాలు చేస్తున్న యాచక వృత్తిలో చేస్తున్న పనులను చూసి అందరనీ ఒకేలా చూడకూడదని.. సమాజంలో ఆడ, మగకి ఎంత గౌరవం ఉందో హిజ్రాలకు కూడా అంతే గౌరవం ఇవ్వాలని కోరారు. దీనిలో భాగంగానే సీనియర్ జర్నలిస్టులు వై.నాగేశ్వరరావు (బ్యూరో చీఫ్-పబ్లిక్ దినపత్రిక), పి. బాలభను (ఈరోజు బాలు) (చీఫ్ ఎడిటర్- ఈరోజు దినపత్రిక), బి.శివప్రసాద్ (చీఫ్ ఎడిటర్-వారధి వారహి మాస పత్రిక), వి. ప్రసాద్ (బ్యూరో చీఫ్-జిటిపిఎల్), కె.కన్నబాబు (బ్యూరో చీఫ్- 6టీవీ), ఎన్. లక్ష్మి నారాయణ (చీఫ్ రిపోర్టర్-ఎస్ డి వి న్యూస్), పి.సత్యం (రిపోర్టర్-వాజి న్యూస్), పి.శ్రీనివాస్ నాయుడు (రిపోర్టర్-ఆంధ్రప్రభ), పి.నగేష్ బాబు (ఫోటో జర్నలిస్ట్-ఆంధ్రప్రభ), కె విఆర్.నాయుడు (వీడియో జర్నలిస్ట్- వాజి న్యూస్) తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సిబ్బంది, పలువురు సామాజిక కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎలక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699

# ఘనంగా యండమూరులో "రైతన్న మీకోసం"








**కరప, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగ బలోపేతం కోసం ఐదు కీలక చర్యలను అమలు చేస్తున్నారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. కరప మండలం యండమూరులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "రైతన్న మీకోసం" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మారెళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన "రైతన్న మీకోసం"లో ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నీటి భద్రత, డిమాండ్‌కు అనుగుణమైన పంటల సాగు, అగ్రిటెక్ ప్రోత్సాహం, ఫుడ్ ప్రాసెసింగ్ అభివృద్ధి, ప్రభుత్వ మద్దతు ధర వంటి విధానాలతో రైతుల ఆదాయాన్ని పెంచేందుకే కృషి చేస్తోందన్నారు. రైతు లకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ అవసరమైన సదుపాయాలు, మద్దతు ధర, ఆధునిక వ్యవసాయ పద్ధతులను చేరువ చేస్తున్నామని భరోసా ఇచ్చారు. కొత్త సాంకేతికత, యంత్రాల వినియోగం ద్వారా శ్రమ తగ్గి దిగుబడులు పెరుగుతాయని రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్ర రావు, పెంకే శ్రీనివాస్ బాబా, నూరుకుర్తి వెంకటే శ్వరరావు, కడలి ఈశ్వరి, రంభాల వెంకటేశ్వరరావు తదితర రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి కూటమి నాయకులు, స్థానిక రైతులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# వృద్ధులకు బండారు ఫౌండేషన్ రగ్గులు పంపిణీ



**అల్లవరం, (రాజధాని వార్తలు):** బండారు రంగా ప్రసాద్ ఫౌండేషన్ నిరుపేద వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నం అంబేద్కర్ నగర్‌లోని సామాజిక సేవా కార్యకర్త బండారు శ్రీదేవి జన్మదినం సందర్భంగా వృద్ధులకు రగ్గులు, బిస్కెట్స్, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఆమె జన్మదినం సందర్భంగా నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో భాగంగా కొమరగిరిపట్నంలో 100 మందికి రగ్గులు పంపిణీ చేశారు. బండారు రంగా ప్రసాద్ ఫౌండేషన్ పేరుతో పలు సేవా కార్యక్రమాలు తన భర్త సత్య సహకారంతో నిర్వహిస్తున్నట్లు శ్రీదేవి తెలిపారు. శీతాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని వారికి ఆమె సూచించారు. రగ్గులు పంపిణీ చేసిన శ్రీదేవికి వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త భూపతి ప్రతిభ, స్థానిక పెద్దలు యాళ్ల సోమరాజు, పొలమూరి చంద్రరావు, భూపతి భాస్కర రావు, ఇంజేటి గణపతి, భూపతి జేజిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ




**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఎయిడ్స్ వ్యాధి, రోగుల పట్ల అవగాహన, ప్రేమ, సమానత్వం కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం దుర్గారావు దొర అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించి ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు అవగాహన కల్పించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ ద్వారా హృదయాన్ని తాకే, ప్రేరణాత్మక ప్రసంగాలు నినాదాలు చేశారు. సమాజానికి ఒక ముఖ్యమైన సందేశాన్ని చేరవేయడానికి ఒకే మనసుతో ఒకే లక్ష్యంతో ఇక్కడ మనం ఉన్నామన్నారు. ఈ ర్యాలీ మనసును వెలిగించే కొవ్వొత్తులు మాత్రమే కాదనీ అవగాహన, ప్రేమ, సమానత్వం అనే విలువలను వెలిగించడంగా భావించాలన్నారు. ఎయిడ్స్ వల్ల మృతి చెందిన వేలాది మంది ఆత్మలకు నివాళిగా ఈ ర్యాలీ నిలుస్తుందన్నారు. హెచ్ఐవితో జీవిస్తున్న మన సోదరులు, సోదరీమణులకు మద్దతుగా నిలబడే బాధ్యత అందరూ అందరూ వహించాలన్నారు. మన చేతుల్లో ఉన్న ఈ చిన్న కొవ్వొత్తుల వెలుగు చీకటిని పారద్రోలి ఆశను నింపుతుందన్నారు. అదేవిధంగా అవగాహన, సహకారం, మన ప్రేమ సమాజంలో ఉన్న అజ్ఞానాన్ని, అని అపనమ్మకాలను, అపహాస్యాన్ని తొలగించే శక్తిని కలిగి ఉన్నాయన్నారు. హెచ్ఐవి అనేది ఒక వ్యాధి మాత్రమే కాదని హెచ్ఐవి ఉన్న మనుషులు మన కుటుంబ సభ్యులు, మన స్నేహితులు, మన సమాజంలో భాగమని వారిని దూరం పెట్టి వివక్షత చూపరాదని తోడుగా నిలబడటం మనబాధ్యత అన్నారు. వివక్షను తగ్గించి అవగాహనను పెంచుదామన్నారు. పరీక్షలు, చికిత్స, సలహా, సేవలు అందరికీ చేరేలా ప్రయత్నించాలన్నారు. యువతకు సురక్షిత జీవనశైలి గురించి తెలియజేయాలన్నారు. ఇచ్చేవి ఉన్నవారికి ప్రేమ, గౌరవం, అండ, ధైర్యం ఇవ్వాలని కోరారు. ప్రతి అడుగు ప్రతి దీపం ఒక కొత్త వెలుగును ప్రపంచానికి అందిస్తుందన్నారు. ఏకతాటిపై నిలబడి ఎయిడ్స్ లేని సమాజాన్ని నిర్మిద్దామన్నారు. ముందుగా అమలాపురం ఏరియా ఆసుపత్రి వద్ద పి ఎల్ హెచ్ఐవి కమ్యూనిటీ టార్గెట్ ఇన్ఫర్మేషన్ సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజే శారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి సిహెచ్ వి భరత లక్ష్మి, వైద్యులు, సిబ్బంది, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ బుచ్చిబాబు, ఐసిటిసి ఎఆర్టి పేరెంట్ సపోర్ట్ టిఐఎన్జీవోస్ సిబ్బంది రాఘవేంద్రరావు, గంటా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ఈఓగా రాపాక శ్రీనివాస్ బాధ్యతలు

**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** ప్రస్తుతం సర్పవరం శ్రీ భావనారాయణస్వామి దేవాలయం కార్యనిర్వాహణాధికారిగా పనిచేస్తున్న రాపాక శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతగా ఇంద్రపాలెం శ్రీ మందేశ్వర శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయాల ఈఓగా నియామకం జరిగింది. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని, భక్తులకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీఈవో కే నాగేశ్వరరావు, జీవోలు ఎన్ ఎన్ వీరభద్రరావు, ఆర్ రాజేశ్వరరావు, వి ఫణీంద్ర కుమార్, సోమరాజు, శివబాబు, వేణు, లక్ష్మణ్, శ్రీనివాస్, దేవాదాయ సిబ్బంది సిహెచ్ రాజు, ఎస్ రాజ్ కుమార్, కళ్యాణ్, లక్ష్మణ్, అనిల్, ఆలయ ప్రధాన అర్చకులు దత్తు, మధు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan